ANN తెలుగు

Follow: @ANNTELUGU

26-11-2024

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 311 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI | REGISTERED NUMBER: APTEL/2003/9316 | WWW.EPAPER.MAHAADAILY.COM




## వామ్మో! నాలుగేళ్ళు ఆగవలసిందేనా?

రేవంత్ సక్సెస్ మంత్రం అదే. తన చుట్టూ ఎన్ని ప్రతికూల పరిస్థితులు కమ్ముకున్నా, ఉప్పెనలు,తుఫానులు ముంచెత్తినా వాటి నుంచి బయటపడి ఆకాశమంత ఎత్తునకు సులభంగా ఆయన ఎగరగలడు. తనను రాజకీయంగా ఎంత అణచివేయాలని కేసీఆర్ కుటుంబసభ్యులు ప్రయత్నించినా మళ్ళీ,మళ్ళీ పైకి లేవడంలోనే ఆయన గెలుపు సూత్రముంది.

సీనియర్ జర్నలిస్ట్ ఎస్కె జకీర్ విశ్లేషణ 4లో

రేస్

## మహా రాజకీయం

- సీఎం రేసులో ఫడ్నవీస్ ముందంజ
- ఢిల్లీకి చేరిన ఫడ్నవీస్, షిండే, అజిత్



02

లాస్

## జీహెచ్ఎంసీలో హౌసింగ్ సొసైటీలకు షాక్

- భూకేటాయింపులు రద్దు చేసిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వానికి సొసైటీలు కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఆదేశం




02

మూవీస్

## ఓటీటీలోకి లక్కీభాస్కర్

- 28 నుండి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్
- థియేటర్‌లో వందకోట్లు కొల్లగొట్టిన సినిమా




02



## పెర్త్ టెస్ట్‌లో భారత్ ఘన విజయం

**స్పోర్ట్స్ డెస్క్ మహా :** ఆస్ట్రేలియా పై టెస్ట్ మ్యాచులలో భారత్ కు తిరుగు లేదని మరో మారు రుజువైంది.ఐదు మ్యాచుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీఇండియా సగర్వంగా 1-0 తో బోణీ కొట్టింది. అడిలైడ్ లో డిసెంబర్ 6 నుండి మొదలయ్యే రెండో టెస్ట్ కు పూర్తి ఆత్మ విశ్వాసంతో వెళ్తుంది. ముందు రోహిత్ ,గిల్ లేకుండా బరిలోకి దిగిన జట్టు పై అంచనాలు తక్కువే.

మిగతా 8లో



## శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో పాముల కలకలం

**హైదరాబాద్, మహా :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పాముల కలకలం.బ్యాంకాక్ నుండి హైదరాబాద్ కి వచ్చిన ఇద్దరు మహిళల దగ్గర పాములు. విషపూరితమైన పాములను స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు. పాముల విక్రయాలు జరుగుతున్నాయా లేక ఎందుకు ట్రాన్స్ పోర్ట్ చేస్తున్నారు అని దర్యాప్తు చేస్తున్న అధికారులు. మహిళలను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టిన కస్టమ్స్ అధికారులు

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 78,550 |
| 22 క్యారెట్ | 72,000 |
| సిల్వర్ (కేజీ) | 91,500 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 80,109.85 |
| నిఫ్టీ | 24,221.90 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

### ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.80 | 174 |

హోల్ సేల్ గుడ్డు ధర


| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.80 | 174 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 6.15 | 184.44 |

# ₹ వందకోట్లు రిజెక్ట్

అదానీ విరాళం తిరస్కరిస్తూ లేఖ




అనవసర వివాదాల్లోకి మమ్మల్ని లాగొద్దు

## మంత్రివర్గ విస్తరణ లేదు..

రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళ్తా

జైలు సెంటిమెంట్ అయితే ఆ ఇంట్లో కవితే సీఎం..

కేటీఆర్‌కు ఆ ఛాన్స్ లేదు.. ఆయనొక సైకోరామ్



ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు.. ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన.. రూ.100 కోట్లు స్వీకరించ కూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని.. అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరపున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

-మహా, హైదరాబాద్

వివరాలు 2లో

### మహా చెప్పినట్టే..

- మంత్రి వర్గ విస్తరణ లేదు
- జైలుకెళితే సీఎం రేసులో ముందుకు

ప్రెస్‌మీట్‌లో అంశాలు ప్రస్తావించిన సీఎం

## అదానీ అంశంపై చర్చకు విపక్షాలు పట్టు


### దద్దరిల్లిన పార్లమెంట్.. ఇరు సభలు 27వ తేదికి వాయిదా



**ఢిల్లీ , మహా:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే విపక్ష సభ్యుల నినాదాలతో ఉభయ సభలు దద్దరిల్లాయి. అదానీ వ్యవహారంపై చర్చకు ప్రతిపక్ష ఎంపీలు పట్టుబడటంతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ సభను ఎల్లుండికి వాయిదా వేశారు. అటు లోక్ సభను కూడా అదానీ వ్యవహారం కుదిపేసింది. విపక్ష సభ్యుల నినాదాలతో హోరెత్తడంతో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సమావేశాల్ని ఈ నెల 27కు వాయిదా వేశారు. మరో వైపు అదానీ వ్యవహారం రాజ్యసభను కుదిపేసింది. శీతాకాల సమావేశాల తొలిరోజే అదానీ అంశంపై చర్చ జరపాలని విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పట్టుబట్టారు. సమావేశాలను ప్రారంభించిన గంటలోనే ఎంపీల నినాదాలతో ఉభయసభల్లో గందరగోళం నెలకొంది. ఏఐసీసీ ప్రెసిడెంట్, సీనియర్ రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో అదానీ ఇష్యూపై చర్చ మొదలుపెట్టాలని కోరారు. అందుకు రాజ్యసభ ఛైర్మన్ అంగీకరించకపోవడంతో సభలో సభ్యులు నినాదాలు చేశారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే మధ్యాహ్నం 12 గంటలకు సభ వాయిదాపడింది. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా నినాదాలు కొనసాగడంతో దీంతో సభను ఎల్లుండి కు వాయిదా వేశారు.

## ప్రజలు రిజెక్ట్ చేసేవారే పార్లమెంట్‌ను కంట్రోల్ చేసేందుకు ట్రై చేస్తున్నారు


### ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ ఫైర్



**ఢిల్లీ, మహా:** కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారని, గందరగోళాలకు పాల్పడుతున్నారని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. 8090సార్లు ప్రజలు తిరస్కరించిన వారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం గూండాయిజాన్ని ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించారు. వారి వ్యూహాలు చివరకు విఫలమైనప్పటికీ, ప్రజలు వారి ప్రవర్తనను నిశితంగా గమనిస్తారని తెలిపారు. ఈ మేరకు శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని, ప్రతిపక్షాలపై పరోక్షంగా మండిపడ్డారు. నిరంతరం ప్రజలు తిరస్కరించే వారు తమ సహచరుల మాటలను విస్మరిస్తారని, ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ అగౌరవపరుస్తారని విమర్శించారు. పార్లమెంట్‌లో ఫలప్రదమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోడీ కోరారు.


## ఫార్మా విలేజ్ ఎవరి కోసం?

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్ళతో కొడతామంటే ఏం చేస్తున్నారు?
- లగచర్ల రైతులు ఈ ప్రభుత్వంపై తిరగబడ్డారు
- మానుకోట ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



**మహా, మహబూబాబాద్:** లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబుతే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. .గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు.

మిగతా 2లో




## భారత రాజ్యాంగం @75 ఏళ్లు

ఏడాదంతా సెలబ్రేషన్స్

నేటి నుండి ప్రారంభం

02



## కాళేశ్వరం కమిషన్ విచారణ ప్రారంభం

- ఇంజినీర్ల సమాధానాలపై కమిషన్ ఛైర్మన్ జస్టిస్ చంద్రఘోష్ అసహనం
- కమిషన్ ముందుకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఇంజినీర్లు

**మహా:** కాళేశ్వరం కమిషన్ విచారణ సోమవారం మళ్లీ ప్రారంభం అయింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఇంజినీర్లు కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసందర్భ సమాధానాలపై కమిషన్ ఛైర్మన్ జస్టిస్ చంద్రఘోష్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.


మిగతా 2లో

## జైనథ్‌లో బస్సు బైక్ ఢీ

ఇద్దరి మృతి-ఒకరికి గాయాలు

02







# వందకోట్లు రిజెక్ట్

**హైదరాబాద్, నవంబర్ 25:** ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు.. ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన.. రూ.100 కోట్లు స్వీకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని.. అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరపున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**అనవసర వివాదాల్లోకి లాగొద్దు**

గత కొన్ని రోజులుగా అదానీ అంశంపై తీవ్ర దుమారం రేగుతోందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం.. నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు స్వీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగవద్దని ఈ సందర్భంగా ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

**తహతహలాడుతున్న కేటీఆర్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారన్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని కేటీఆర్ భావిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జైలుకెళ్లినవాళ్లు సీఎం అయ్యేదుంటే.. ముందు కల్వకుంట్ల కవిత అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు.

**విస్తరణ లేదు.. పెళ్ళికే**

తన తాజా ఢిల్లీ టూర్ పర్యటనపై సైతం సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే ఈ ఢిల్లీ పర్యటన అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఢిల్లీ పర్యటనతో రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేదని ఆయన ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాలపై మంగళవారం పార్టీ ఎంపీలతో చర్చిస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న మంత్రులను కలిసి.. రాష్ట్ర సమస్యలను వారికి వివరిస్తామని చెప్పారు.

## అవసరమైతే ఎన్ని సార్లు అయినా..

అయితే తాను 28 సార్లు ఢిల్లీ వెళ్లానని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీలా పైరవీలు చేయడానికి.. బెయిల్ కోసం తాను ఢిల్లీ వెళ్లడం లేదని బీఆర్ఎస్ అగ్రనేతలను పరోక్షంగా విమర్శించారు. కానీ కేంద్రాన్ని కలిసి మనకు రావాల్సినవి రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవసరమైతే ఎన్నిసార్లు అయినా.. ఢిల్లీ వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అదానీకి ఎన్నో ప్రాజెక్టులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## డెడికేటెడ్ కమిషన్ స్వతంత్రంగా పని చేయాలి

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సిద్ధం చేసిన 35 పేజీల నివేదికను కమిషన్ చైర్మన్‌కు ఆమె అందించారు. బీసీ సంఘాలు, యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి ఈ నివేదికను సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్‌ను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, మేధావులు ఇచ్చిన సూచనలను అమలు చేయలేదని విమర్శించారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు తాత్సారం చేసిందని ఆరోపించారు. డెడికేటెడ్ కమిషన్ స్వతంత్రంగా పని చేయాలని ఆకాంక్షించారు. అయినా ప్రత్యేక కార్యాలయం, మానవ వనరులు, సామాగ్రి ఇవ్వకుంటే ఆ కమిటీ ఎలా పని చేస్తుందని ప్రశ్నించారు. కులగణనపై నెల రోజుల్లోనే నివేదిక అంటే ఎన్నో అనుమానాలు వస్తున్నాయన్నారు. డెడికేటెడ్ కమిటీకి చట్టబద్ధత కల్పించాలన్నారు. రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికీ స్టిక్కర్ వేయని ఇళ్లు దాదాపు 70 శాతం ఉన్నాయని, కానీ సర్వే మాత్రం 90 శాతం పూర్తయిందని చెప్పడం ఏమిటన్నారు. కులగణనకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. కులగణన చేపట్టబోమని బీజేపీ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని వెల్లడించారు. ఆ పార్టీ తీరును బీసీలు ఖండించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఫార్మా విలేజ్ ఎవరి కోసం?




(మొదటి పేజీ తరువాయి)


ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ముఖ్యమంత్రికి ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని.. అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నారని మండిపడ్డారు. తాను ఇక్కడకు వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. తాను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, మధుసూదన్ చారి, ఎమ్మెల్యేలు పళ్ళ రాజేశ్వర్ రెడ్డి కౌశిక్ రెడ్డి,ఎంపీ వద్దు రాజు రవిచంద్ర.మాజీ ఎమ్మెల్యేలు డి ఎస్ రెడ్యా నాయక్,బానోతు శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, బానోతు హరిప్రియ, తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపనేని నరేందర్. బిఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మానుకోట మున్సిపాలిటీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి. వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, సొసైటీ చైర్మన్ నాయని రంజిత్, యాళ్ల మురళీధర్ రెడ్డి, పర్కాలశ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# జైనథ్‌లో బస్సు బైక్ ఢీ

### ఇద్దరి మృతి-ఒకరికి గాయాలు





**ఆదిలాబాద్,మహా :** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్నఆర్టీసీ బస్సు బైక్ ఢీకొన్న ఘటనలో 58ఏళ్ల వృద్ధుడు నాలుగేళ్ల బాలుడు అక్కడికక్కడే మరణించగా మరో బాలుడికి గాయాలయ్యాయి. జైనథ్ ఆలయ జాతరలో తన ఇద్దరు మనవళ్లకు బొమ్మలు కొనిపెట్టి బైక్ పై ఆదిలాబాద్‌కు తిరిగి వస్తుండగా ఆదిలాబాద్ నుండి చంద్రపూర్ వెళ్తున్న బస్సు నిరాల జైనథ్ మార్గ మధ్యలోని హన్మాన్ మందిర్ వద్ద ఢీకొట్టింది. ఈఘటనలో ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన షేక్ అలీ (58) ఇజహాన్ (4) స్పాట్ లోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో మరో బాలుడు అర్హాన్ (5) ఎగిరి రోడ్ ప్రక్కన పడడంతో అతనికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం.ఒకే కుటుంబంలోని ఇద్దరు మృత్యువాత పడడంతో ఖానాపూర్ లోని ఆయన నివాసంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటిటిలోకి లక్కీభాస్కర్

### 28 నుండి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్

**థియేటర్‌లో వందకోట్లు కొల్లగొట్టిన సినిమా**



**మహా:** దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం లక్కీ భాస్కర్. అక్టోబర్ 31న విడుదలైన ఈ సినిమా మొదటి షోతోనే సక్సెస్ టాక్ తెచ్చుకుంది. సుమారు రూ. 100 కోట్లకు పైగానే వసూళ్లు వచ్చాయి. బ్యాకింగ్ సెక్టార్ నేపథ్యానికి ఫ్యామిలీ ఎమోషన్స్ ను జోడించి లక్కీ భాస్కర్ సినిమాను తెరకెక్కించాడు వెంకీ అట్లూరి. అలాగే స్టాక్ మార్కెట్, భారతీయ మధ్యతరగతి మనస్థత్వాల అంశాలన ప్రస్తావించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ క్రమంలో థియేటర్లలో ప్రేక్షకుల మన్ననలు అందుకున్న లక్కీ భాస్కర్ ఇప్పుడు ఓటీటీలోకి రాబోతున్నాడు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ లక్కీ భాస్కర్ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. తాజాగా దుల్కర్ సినిమా ఓటీటీ రిలీజ్ పై అధికారిక ప్రకటన వచ్చేసింది. నవంబర్ 28 నుంచి లక్కీ భాస్కర్ మూవీని స్ట్రీమింగ్ కు తీసుకొస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది నెట్ ఫ్లిక్స్. 'అదృష్టం ఒక మనిషిని ఎంత దూరం తీసుకెళుతుంది? నవంబర్ 28న నెట్ ఫ్లిక్స్ లో మా లక్కీ భాస్కర్ ని చూడండి' అని పోస్టర్ ను కూడా రిలీజ్ చేసింది. తెలుగుతో పాటు హిందీ, మలయాళం, కన్నడ, హిందీ భాషలలో ఈ బ్లాక్ బస్టర్ సినిమా అందుబాటులో ఉండనుంది.

## వాహనదారులపై పన్ను భారం

### రోడ్ టాక్స్ వడ్డింపు

**ఆదాయం పెంపు కోసం రవాణా శాఖ నిర్ణయం**

**త్వరలోనే ఉత్తర్వులు**



**హైదరాబాద్, మహా :** వాహనదారులకు షాక్ ఇవ్వడానికి రేవంత్ ప్రభుత్వం రెడీ అయింది. చాలా రాష్ట్రాలలో రవాణా శాఖ ద్వారా ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తున్న క్రమంలో ఆయా రాష్ట్రాలలో అనుసరిస్తున్న విధానాలను స్టడీ చేసిన తెలంగాణ అధికారులు రాష్ట్రంలోనూ ఆ విధానాలను అమలు చేయాలని నిర్ణయించారు. దీంతో రోడ్ ట్యాక్స్ పెరిగే అవకాశం ఉంది. దీంతో వాహనదారుల జేబులకు చిల్లుపడే అవకాశం ఉంది. త్వరలో పెట్రోల్, డీజిల్ తో నడిచే నూతన వాహనాలకు విధించే రోడ్డు ట్యాక్స్ పెరగనుంది. ఇప్పటికే దీనిపైన కసరత్తు ప్రారంభించిన అధికారులు పక్క రాష్ట్రాలలోని రవాణా శాఖలో వస్తున్న ఆదాయంపైన అధ్యయనం చేశారు. పక్క రాష్ట్రాలలో వాహనాల ద్వారా వస్తున్న ఆదాయం, రిజిస్ట్రేషన్ విధానం తదితర అంశాలపైన అధ్యయనం చేసి దీనికి సంబంధించిన నివేదికను రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘానికి ఇవ్వడానికి సిద్ధం చేశారు. ఒకవేళ రోడ్డు టాక్స్ పెంచితే లక్ష రూపాయల కంటే ఎక్కువ ధరలు ఉన్న బైకులు, 10 లక్షల కంటే ఎక్కువ విలువైన కార్లకు రోడ్డు టాక్స్ పెరిగే అవకాశం ఉందని తెలుస్తుంది. రాష్ట్రంలో రోడ్డు టాక్స్ పెరిగే అవకాశం ఉన్నా, అది ఇతర రాష్ట్రాల కంటే తక్కువగానే ఉండొచ్చని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం రోడ్డు టాక్స్ ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి సుమారు ఏటా 7 వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. ఒకవేళ రోడ్డు టాక్స్ పెంచితే 8 వేల కోట్ల రూపాయల నుంచి 9 వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

### ప్రస్తుతం ఉన్న రోడ్ టాక్స్ వసూలు

ఇప్పటివరకు రోడ్ ట్యాక్స్ వసూలు ఇలా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు ఐదు లక్షల రూపాయల ధర లోపు ఉన్న కార్లకు 13 శాతం , ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయల మధ్య ధర ఉన్న కార్ల కోసం 14 శాతం, 10 లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయల మధ్య ధర ఉన్న కార్ల కోసం 17 శాతం, 20 లక్షల రూపాయల నుంచి ఆ పైన ధర ఉన్న కార్ల కు 18 శాతం టాక్స్ వసూలు చేస్తున్నారు. రోడ్ ట్యాక్స్ పెరిగితే కొత్త వాహనాలు కొనాలనుకునే వారికి బ్యాడ్ న్యూస్ ఇక ద్విచక్ర వాహనాలకు సంబంధించి 50 వేల లోపు వాహనాలకు 9 శాతం ఆపై విలువ ఉంటే 12 శాతం రోడ్ టాక్స్ వసూలు చేస్తున్నారు.

## అర్ధరాత్రి అనుమతుల వెనుక ఆంతర్యమేంటి?




### ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

**ఏపీ:** ఏపీ సీఎం చంద్రబాబుకు ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల లేఖ రాశారు. అదానీతో గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని అందులో ఆమె డిమాండ్ చేశారు. సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆమె కోరారు. అదానీతో అక్రమ డీల్ కారణంగా రాష్ట్ర ప్రజలపై రూ. లక్షన్నర కోట్ల వరకు భారం పడుతుందని ఆమె పేర్కొన్నారు. అర్ధరాత్రి ఆ ఒప్పందాలు జరిగాయని, వాటికి ఎందుకు అర్ధరాత్రి అనుమతులు ఇచ్చారనేదానిపై దర్యాప్తు చేయాలన్నారు. తక్షణమే ఆ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ఆ వెంటనే ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్ లో పెట్టాలన్నారు.

## జీహెచ్ఎంసీలో హౌసింగ్ సొసైటీలకు షాక్

### భూకేటాయింపులు రద్దు చేసిన సుప్రీంకోర్టు

**ప్రభుత్వానికి సొసైటీలు కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఆదేశం**



**న్యూఢిల్లీ, మహా :** అధికారులు, ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టు సొసైటీలకు గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ప్రభుత్వాలు భూములు కేటాయించిన విషయం తెలిసిందే. ఇటీవల జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో సభ్యులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఇళ్ల స్థలాలు కేటాయించింది. అయితే, తాజాగా జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సొసైటీల భూ కేటాయింపులను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా తీర్పునిచ్చింది. జీహెచ్ఎంసీ పరిధిలోని హౌసింగ్ సొసైటీలకు ప్రస్తుత, గత ప్రభుత్వాలు భూ కేటాయింపులు చేయడాన్ని సవాల్ చేస్తూ రావు బీ చెలికాని అనే వ్యక్తి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఆ పిటిషన్‌పై సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం భూ కేటాయింపులను రద్దు చేస్తూ తుది తీర్పును వెలువరించింది. ప్రభుత్వానికి సొసైటీలు కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో భూకేటాయింపులపై సందిగ్ధత నెలకొంది. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ (మ్యాక్) హౌసింగ్ సొసైటీ ప్రతినిధులకు పేట్‌బషీరాబాద్‌లోని 38 ఎకరాల భూమికి రేవంత్ ప్రభుత్వం కేటాయించింది. సెప్టెంబర్ 8న రవీంద్ర భారతిలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు పత్రాలను సీఎం రేవంత్ అందజేశారు. ఉమ్మడి ఏపీలో సీఎం వైఎస్సార్ హయాంలో జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టుల మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీకి ఇళ్ల స్థలాల కోసం 70 ఎకరాల భూమిని కేటాయించారు. అయితే 2008 మార్చిలో నిజాంపేట్‌లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్‌లో 38 ఎకరాలను జర్నలిస్టుల ఇళ్ల కోసం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయించారు. కాగా నిజాంపేటలోని 32 ఎకరాల స్థలం సొసైటీ ఆధీనంలో ఉండగా పేట్‌బషీరాబాద్‌లోని 38 ఎకరాలకు సంబంధించిన ఇండ్ల స్థలాల కేటాయింపు పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి అర్హులైన వారికి అందజేశారు. అయితే తాజాగా వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హౌసింగ్ సొసైటీలు పొందిన ఈ భూముల విషయమై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# మాజీ సీఎం జగన్‌ను మోడీ కూడా కాపాడలేరు


## ఆయన పని అయిపోయినట్టే..

### అదానీ, జగన్ ఇద్దరూ అరెస్టవుతారు..

### గోనె ప్రకాశ్ రావు



**హైదరాబాద్, మహా :** సౌర విద్యుత్ ఒప్పందాల్లో భాగంగా అదానీ ముడుపుల వ్యవహారంలో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పూర్తిగా ఇరుక్కున్నారని సీనియర్ రాజకీయ నేత గోనె ప్రకాశ్ రావు అన్నారు. ఆ కేసు నుంచి జగన్ బయటపడే అవకాశమే లేదని చెప్పారు. లంచం కేసులో అదానీ, జగన్ ఇద్దరూ అరెస్ట్ అవుతారని అభిప్రాయపడ్డారు. వీరిద్దరి అరెస్ట్ ను ప్రధాని మోదీ కూడా ఆపలేరని చెప్పారు. న్యూయార్క్ టైమ్స్ లో దీనికి సంబంధించిన కథనం వచ్చిందని ఆ పత్రికలో కథనం వస్తే కథ ముగిసినట్టేనని అన్నారు. వీరిద్దరినీ తమకు అప్పజెప్పాలని అమెరికా కోరుతుందని, మోదీ కూడా దీన్ని ఆపలేరని చెప్పారు. అయితే దీనికి మూడు నెలలు పడుతుందా? లేదా ఆరు నెలలు పడుతుందా? అనేది చెప్పలేమని అన్నారు. ఏపీలో సోలార్ పవర్ కొనుగోళ్ల కోసం అదానీ లంచాలు ఇచ్చారంటూ అమెరికా కోర్టులో కేసు నమోదైన సంగతి తెలిసిందే. జగన్‌కు రూ. 1,750 కోట్ల ముడుపులు అందాయనే విషయాన్ని ఛార్జ్ షీట్ లో పేర్కొన్నారు. ఈ అంశం ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ అంశంపై మాట్లాడుతూ గోనె ప్రకాశ్ రావు పైవ్యాఖ్యలు చేశారు.



# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

## ఉయిక ఇందిరను పరామర్శించిన కంది మౌనారెడ్డి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలికి భరోసా



**మహా, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరను ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది మౌన శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఉయిక ఇందిర భర్త తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో మౌనారెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉంటామంటూ ఓదార్చారు.

ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, ఆదిలాబాద్ రూరల్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న, గ్రామ పటేల్ ఎర్మ విఠల్, ఆత్రం నగేష్, ఉయిక రమేష్, తుమ్రం కిషన్, నాయకులు బోనగిరి సంటన్న, బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న తదితరులు ఉన్నారు.

# పారం కోళ్లలో డేంజర్ బ్యాక్టీరియా

**హైదరాబాద్, మహా :** తెలంగాణ, కేరళలో అమ్మే బాయిలర్ కోళ్లలో యాంటీ బయాటిక్స్ను తట్టుకునే ప్రమాదకరమైన బ్యాక్టీరియా వృద్ధి చెందుతున్నట్టు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషియన్ (ఎన్ఐఎన్) సైంటిస్టులు గుర్తించారు. పౌల్ట్రీ ఫామ్స్ లో కోళ్లకు అవసరమున్నా, లేకపోయినా యాంటీ బయాటిక్స్ విచక్షణరహితంగా ఇవ్వడంతో వాటిలో యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) వృద్ధి చెందుతున్నదని నిర్ధారించారు. ఇలాంటి చికెన్ ను సరిగ్గా ఉడికించకుండా తింటే ఏఎంఆర్ జన్యువు మనుషుల్లోనూ వృద్ధి చెందే ప్రమాదముందని హెచ్చరించారు.

### సరిగ్గా ఉడికిస్తే బ్యాక్టీరియా నాశనం

కేరళను సౌత్ జోన్ గా, తెలంగాణను సెంట్రల్ జోన్ గా విభజించి ఈ అధ్యయనం చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లోని 47 పౌల్ట్రీఫామ్స్ లోని 131 శాంపిళ్ల(కోడి రెట్టల)ను సేకరించి, వాటి నుంచి డీఎన్ఏను వేరు చేసి పరిశోధించగా ఆందోళన కలిగించే అంశాలు వెల్లడయ్యాయి. ఈ కోళ్ల రెట్టలో విరేచనాలకు కారణమయ్యే ఈకోలి, చర్మ వ్యాధులకు కారణమయ్యే స్టెఫిలోకాకస్ ఆరియస్తో పాటు





క్లాస్ట్రిడియం పెర్ఫ్రింజెన్స్, క్లేబ్సియెల్లా ఎంటరోకోకస్ ఫెకాలిస్, సూడోమోనాస్ ఎరుగినోసా, బాక్టీరియోడ్స్ ఫ్రాజిల్స్ వంటి హానికరమైన బ్యాక్టీరియా ఆనవాళ్లను సైంటిస్టులు కనుగొన్నారు. ఇవన్నీ మన దేశంలో యాంటీ బయాటిక్ ట్రీట్ మెంట్కు సవాల్ విసిరే బ్యాక్టీరియాలేనని ఎన్ఐఎన్ డ్రగ్స్ సేఫ్టీ డివిజన్ సైంటిస్టులు డాక్టర్ షోబీ వేలేరి, సంయుక్త కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇలాంటి చికెన్ను అధిక ఉష్ణోగ్రతలో ఉడికించడం ద్వారా వీటిలో 95 శాతం బ్యాక్టీరియా నాశనమవుతుందని తెలిపారు. తెలంగాణతో పోలిస్తే కేరళలోనే యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) జన్యువు తీవ్రత ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు.

యాంటీ బయాటిక్స్ కు ఏఎంఆర్ సవాల్ విసురుతుందని ఈ రీసెర్చ్ కు నేతృత్వం వహించిన డాక్టర్ షోబీ వేలేరి అన్నారు. ''కేరళ, తెలంగాణలోని పలు పౌల్ట్రీ ఫామ్‌ల నుంచి కోడి రెట్ట సేకరించాం. ఇందులో జన్యు సంబంధమైన డీఎన్ఏను వేరు చేశాం. ఇందులో ప్రాణాంతక బ్యాక్టీరియా జన్యువులు యాంటీ బయాటిక్స్ ను తట్టుకునే అదనపు పొరను కలిగి ఉండడం గమనించాం. ఈ బ్యాక్టీరియా న్యుమోనియా, కలరా, ఫుడ్ పాయిజనింగ్ వంటి తీవ్రమైన అనారోగ్యానికి గురి చేసి ట్రీట్ మెంట్ కు సవాల్ గా మారనుంది'' అని వెల్లడించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) పర్యావరణ వ్యవస్థలో వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం తక్షణమే అరికట్టాల్సి ఉందన్నారు. కాగా, సైంటిస్టులు డాక్టర్ షోబీ వేలేరి, డాక్టర్ అజ్మల్ అజీమ్, పర్తి సాగర్, నేరెళ్లపల్లి సంయుక్త కుమార్ రెడ్డి రాసిన ఈ రీసెర్చ్ పేపర్ 'కంపారిటివ్ ఇమ్యునాలజీ, మైక్రోబయాలజీ అండ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్' అనే ఇంటర్నేషనల్ జర్నల్ లో 'ది యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ ప్రొఫైల్ ఇన్ పౌల్ట్రీ ఆఫ్ సెంట్రల్ అండ్ సౌతెర్న్ ఇండియా ఈజ్ ఎవాల్వింగ్ డిస్టింక్ట్ ఫీచర్స్' అనే శీర్షికతో ఈ నెలలో పబ్లిష్ అయింది.

# కష్టాల్లో తోడుగా..

## కంది మౌనా శ్రీనివాస రెడ్డి పరామర్శలు





**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి ఆదిలాబాద్ పట్టణంతో పాటు జైనథ్ మండలంలో పర్యటించారు. పలువురు కుటుంబ పెద్దలను, ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న కుటుంబాల చెంతకు వెళ్లి ఓదార్చారు. ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా భర్త, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. జైనథ్ మండలం గిమ్మ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త దోసలి గంగన్న కుమారుడు దోసలి ప్రతాప్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామంలో బాపూరావు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను సైతం ఆమె పరామర్శించి ఓదార్చారు. అలాగే జిట్ట నర్సమ్మ కూడా మరణించడంతో వారి కుటుంబీకులను పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త కుంట నర్సింగ్ అనారోగ్యంతో బాధపడుతుండంతో ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, నాయకులు బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న, గడ్డం అఖిల్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, రావుల సోమన్న, గ్రామస్తులు దీపక్ రావు, సదాలి రామన్న, ముత్యాల నిఖిలేష్, పూదరి ప్రభాకర్ రావు, కోర్రి రమేష్, సురేష్, భావ్నే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒప్పందాల సంగతేంటి?

**: హరీశ్‌రావు**



**మహా:** యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ ఇచ్చిన రూ. 100 కోట్ల విరాళాన్ని సీఎం రేవంత్ రెడ్డి తిరస్కరించిన విషయం తెలిసిందే. సీఎం నిర్ణయంపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అదానీ విరాళాన్ని తిరస్కరించారు గానీ, మరి ఒప్పందాల సంగతేమిటంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను కూడా తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

## ఎంఈవో శ్యాంసుందర్



**ఆదిలాబాద్ మహా :** ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులు గా తీర్చిదిద్దవచ్చని మండల విద్యాధికారి శ్యాంసుందర్ అన్నారు. సోమవారం భీంపూర్ మండలంలోని పిప్పల్కోటి మండల ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జిల్లాలో రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్, యూఎస్ ఏఐడీ సహకారంతో సెరీ కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎల్ఎన్ కు అనుబంధంగా విద్యాశాఖ సమన్వయంతో ప్రతి మండలానికి ఒక మండల మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ మోడల్ లైబ్రరీలో వివిధ రకాల రంగురంగుల కథల పుస్తకాలు, పఠన సామాగ్రి ద్వారా విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెంపొందించవచ్చని, తల్లిదండ్రులు వారి ఇంటి వద్ద మంచి విలువలతో కూడిన విద్యాభ్యాసం అందించాలని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో పాటు సుశిక్షితులైన ఉపాధ్యాయుల ద్వారా బోధన జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విలాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, గ్రామస్తులు, నాయకులు, ఉపాధ్యాయులు, రూమ్ టు రీడ్ టీం సభ్యులు మహేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్ల నిర్మాణానికి కోటి రూపాయల నిధులు మంజూరు

**నిర్మల్ మహా :** భైంసా మండలంలోని కామోల్, మాంజ్రీ, బిజ్జుర్, కుంసర గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సి. సి. రోడ్ల నిర్మాణానికి కోటి రూపాయల నిధులు మంజూరైనట్లు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. సోమవారం భైంసా పట్టణంలోని తన నివాసంలో మండల నాయకులకు ప్రొసీడింగ్ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. త్వరలో మరిన్ని నిధులు మంజూరు కానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ వైస్ ఎంపిపి నర్సారెడ్డి, నాయకులు సోలంకి భీమ్ రావు, బిజెపి మండల అధ్యక్షులు భూమేష్, మాజీ ఎంపిటిసిలు ప్రతాప్ సింగ్, వెంకట్ రెడ్డి, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బంది పెట్టవద్దు - ఆడె గజేందర్



**ఆదిలాబాద్ మహా :** మార్కెట్ కు సోయా కొనుగోలుకు తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయవద్దని బోథ్ అసెంబ్లీ ఇంఛార్జి ఆడె గజేందర్ అన్నారు. సోమవారం బోథ్ వ్యవసాయ మార్కెట్ ను సందర్శించిన ఆయనకు రైతులు తమకు గన్ని బ్యాగుల సమస్య ఉందని చెప్పడంతో ప్రతి మార్కెట్ యార్డులోసరిపడినన్ని గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచాలని మార్క్ఫెడ్ డీఎం కు ఫోన్ చేసి చెప్పారు. అదేవిధంగా రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా సోయా కొనుగోలు చేపట్టాలని తెలిపారు కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు రాజు యాదవ్, ఉమేష్, మాజీ ఎంపీటీసీలు మహేందర్, షేక్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ బత్తుల, సిరి చల్మా ఉప సర్పంచ్ అజీమ్, మండల ప్రధాన కార్యదర్శి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, ఏఎంసీ డైరెక్టర్ అబ్రార్, సీనియర్ నాయకులు అబుద్, గడ్డల నారాయణ, గాజుల పోతన్న, భోజన్న, సాయన్న, అసిఫ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



# సీసీఎస్ ఏసీపీగా ఎండీ సర్వర్ బాధ్యతలు స్వీకరణ

**ఖమ్మం క్రైమ్, నవంబర్ 25, మహా:** ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సీసీఎస్ ఏసీపీగా ఎండీ సర్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. డీజీపీ కార్యాలయం హైదరాబాద్ నుండి ఖమ్మం సీసీఎస్ కు ఆయన బదిలీపై వచ్చారు.



# నిర్మల్ లో ఘనంగా పడిపూజ

**ఆదిలాబాద్ మహా :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య నగర్ కాలనీ సోమవారం అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. వేద పండితులు చక్రవర్తుల తేజ ఆచార్యులు, కడ్తాల్ ధర్మశాస్త ఆలయ గురు స్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టి ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం పదునెట్టాంబడి వెలిగించారు. కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప స్వామి భక్తులు ఆలపించిన భక్తి గీతాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. పూజ అనంతరం భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జుట్టు సచిన్, దినేష్ గురుస్వాములు చెనగారపు చిన్నయ్య, కోటగిరి గోపి, బద్రి శ్రీనివాస్, జిందం గోవర్ధన్, కందుల శేఖర్, చిట్యాల రమేష్, పోతిండ్ల శంకర్, నర్సయ్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మీయుల వేడుకల్లో కంది మౌనా శ్రీనివాస రెడ్డి





**ఆదిలాబాద్ మహా :** శుభ ముహూర్తాలు ప్రారంభం కావడంతో శుభ కార్యాలు జోరందుకున్నాయి. అభిమానంతో ఆహ్వానించినవారి వేడుకలకు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌన శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. ఆదిలాబాద్ రూరల్ మండలం న్యూ రాంపూర్ గ్రామంలో గల దొర్శెట్టి రాజు, లింగన్న నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కంది శ్రీనన్న కానుకను బహుకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలు వివాహ వేడుకలకు సైతం అటెండయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి పెళ్లి కానుకలు అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, నాయకులు బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న, గడ్డం అఖిల్ రెడ్డి, రావుల సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకుని మానవత్వం చాటుకున్న యువకుడు

## గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలింపు

### సాయం చేసిన వ్యక్తికి ధన్యవాదాలు తెలిపిన బాధితులు



**అశ్వారావుపేట, నవంబర్ 25, మహా:** అశ్వారావుపేట మండల కేంద్రంలో రోడ్ల పరిస్థితి రోజురోజుకూ అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. రింగు రోడ్ సెంటర్ దగ్గర రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతలు ఇప్పటికే అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఊరి ఎంట్రన్స్‌లో డివైడర్ వద్ద వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నా, సంబంధిత అధికారుల్లో, నాయకుల్లో ఎలాంటి చలనం కనిపించడం లేదు.

### గుంతల కారణంగా తల్లి కొడుకులకు గాయాలు

శనివారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్తున్న తల్లి, కొడుకు రింగు రోడ్ సెంటర్ వద్ద గుంతల కారణంగా బండి అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో తల్లి తల వెనుక భాగానికి తీవ్ర గాయమవ్వడంతో పాటు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. కుమారునికి కూడా చేతులు, కాళ్లకు గాయాలు అయ్యాయి. సంఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

### ప్రజల ఆవేదన, అధికారుల నిర్లక్ష్యం

ఈ సంఘటన స్థానికులను ఆవేదనకు గురిచేసింది. గుంతల కారణంగా వాహనాలు నాశనం అవుతున్నా, ప్రజలు గాయపడుతున్నా, నాయకులు, అధికారులు స్పందించకపోవడం బాధాకరం. ఇలాంటి ప్రమాదాల వల్ల తమ ప్రాణాలు పోతున్నా, అధికారులకు ఏ బాధ్యతా పుట్టదు అని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలను పూడ్చడంలో నిర్లక్ష్యం చూపుతున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఆదర్శంగా నిలిచిన స్థానిక యువకుడు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తల్లి, కొడుకులకు సహాయం చేయడంలో సీమకుర్తి జితేంద్ర అనే యువకుడు తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ప్రమాదం జరిగినప్పుడు అటుగా వెళుతున్న జితేంద్ర కలెక్షన్ డబ్బులు చేతిలో ఉన్నప్పటికీ, ఏమాత్రం వెనుకాడకుండా బురదలో పడి లేవలేని స్థితిలో గాయపడి ఉన్న తల్లిని, ఆమె కొడుకును రోడ్డు పక్కకు తీసుకొచ్చి కూర్చోబెట్టాడు. వెంటనే తనకు తెలిసిన వారికి ఫోన్ చేసి కారు రప్పించి, వారిని ఆసుపత్రికి చేరవేశాడు. చికిత్స పొందుతున్న తల్లి, కొడుకు జితేంద్ర సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటన చూసిన స్థానికులు జితేంద్ర మానవత్వాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి యువతలో ఉన్న గొప్పగుణాలు అందరికీ ఆదర్శం కావాలి అని అభినందనలు తెలియజేశారు.

# మందుపాతరల వల్ల తీవ్ర ప్రమాదం

## వాటి వినియోగం ఆపివేయండి

### ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన



**మహా, జాతీయం:** ప్రపంచంలోని చాలా దేశాల్లో మందుపాతరల ఉత్పత్తి, వినియోగం పెరుగుతుండటంపై ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. యాంటీపర్సనల్ ల్యాండ్‌మైన్స్ ఉత్పత్తిని, వినియోగాన్ని నిలిపేయాలని ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్, పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. కాంబోడియాలో ఏర్పాటు చేసిన ఓ సదస్సులో గుటెరస్ మాట్లాడుతూ.. ఒట్టావా ఒప్పందం అమలు చేయని కొన్ని దేశాలు వాటి వినియోగాన్ని పునరుద్ధరించుకోవడం వల్ల ముప్పు మరింత పెరుగుతోందన్నారు. రష్యా, మయన్మార్, ఇరాన్, ఉత్తర కొరియా దేశాల్లో మందుపాతరల వినియోగం ఇంకా కొనసాగుతోంది. వీటితోపాటు కాంబోడియా, భారత్, మయన్మార్, పాకిస్థాన్, గాజాలోనూ వీటిని వినియోగిస్తున్నారు. మందుపాతరల కారణంగా గతేడాది ప్రపంచవ్యాప్తంగా 5757 మంది మృతి చెందడం లేదా గాయపడినట్లు 'ల్యాండ్‌మైన్ మానిటర్' నివేదిక వెల్లడించింది.

# టెలికాం కంపెనీలకు ట్రాయ్ కీలక ఆదేశాలు

## వెబ్‌సైట్‌లో కవరేజీ మ్యాప్ ఉంచాల్సిందే



**మహా, జాతీయం:** టెలికాం కంపెనీలకు ట్రాయ్ కీలక ఆదేశాలు జారీ చేసింది. వైర్‌లెస్ టెలికాం ప్రొవైడర్లు జియో స్పేషియల్ కవరేజీ మ్యాప్స్‌ను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని ట్రాయ్ సూచించింది. అంటే ఏయే ప్రాంతాల్లో తమ నెట్‌వర్క్ కవరేజీ అందుబాటులో ఉందో ఆయా మ్యాప్స్‌లో చూపించాల్సి ఉంటుంది. 2జీ, 3జీ, 4జీ, 5జీ సర్వీసులకు సంబంధించి కవరేజీ వివరాలు అందులో కనిపిస్తాయి. దీని వల్ల తమ ప్రదేశంలో ఏ నెట్‌వర్క్ లభిస్తుందో వినియోగదారుడు తెలుసుకోవడానికి వీలు పడుతుందని ట్రాయ్ పేర్కొంది. అంతేకాదు ఏ నెట్‌వర్క్‌ను ఎంచుకుంటే మెరుగైన కవరేజీ లభిస్తుందో వినియోగదారుడు తెలుసుకోగలడని తెలిపింది. టెలికాం ప్రొవైడర్లతో పలు అంశాలపై సంప్రదింపులు జరుపుతున్న ట్రాయ్.. ఈ అంశాన్నీ చర్చకు పెట్టింది. దీనిపై ఆయా కంపెనీలు సమర్పించిన నివేదికల ఆధారంగా ట్రాయ్ తుది మార్గదర్శకాలు జారీ చేయనుంది.



# కలెక్టర్‌కు రెండవ ఏఎన్ఎమ్‌ల వినతి పత్రం

నిర్మల్ మహా : రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు సోమవారం వినతిపత్రం అందజేశారు. త్రిసభ్య కమిటీ రిపోర్ట్ లేకుండానే ప్రభుత్వం వచ్చే నెల డిసెంబర్ 29న రెండవ ఏఎన్ఎంలకు రాత పరీక్ష నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. దాదాపు 20 సంవత్సరాలుగా వృత్తిపై ఆధారపడి పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎక్స్‌గ్రేషియా ఆరోగ్య కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జానా, శోభారాణి, సరస్వతి, లక్ష్మి, విమల, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

EDITORIAL ఎడిటోరియల్

# వామ్మో! నాలుగేళ్ళు ఆగవలసిందేనా?

''ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అప్రదిష్టపాల్జేసేందుకు ,ప్రభుత్వాన్ని అస్థిర పరచడానికి బిఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్ ఒక పథకాన్ని రచించినట్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు హైకోర్టులో అయిదు రోజుల కిందట ఆరోపించారు.కొడంగల్ నియోజకవర్గం 'లగచర్ల'లో ఫార్మా సంస్థల కోసం ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా భారీ కుట్ర జరిగిందని,ఈ కుట్ర అమలుకు గాను 10 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని,వీటి వెనుక కేసీఆర్ ప్రమేయం ఉండవచ్చున''ని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనుమానం వ్యక్తం చేశారు.లగచర్ల కేసు విచారణ సందర్భంగా,హైకోర్టులో వాదోపవాదాల సమయంలో కేసీఆర్ ప్రస్తావన వచ్చింది.లగచర్ల హింసకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఏ2 గా ఉన్నారు.నరేందర్ రెడ్డి రిమాండ్ రిపోర్టులో ఇప్పటికే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరున్నది.తాజాగా కేసీఆర్ పేరు కూడా ప్రచారంలోకి రావడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ''మూడు నెలల్లో రేవంత్ సర్కార్ కూలిపోతుంది.లేదా నాలుగు నెలల్లో కూలిపోతుంది.అదిగో అసంతృప్తి.,ఇదిగో అసమ్మతి. అదిగో ప్రజల్లో తిరుగుబాటు.ఇదిగో కల్లోలం.అదిగో భీభత్సం.కాంగ్రెస్ పార్టీ నాయకులే ఆయనను దించేస్తారు''.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి కాకుండానే బిఆర్ఎస్,బీజేపీ నాయకుల నోటి నుంచి శర పరంపరగా వస్తున్న మాటలు.తాను తొక్కుకుంటూ ముఖ్యమంత్రి స్థాయికి వచ్చానని రేవంత్ రెడ్డి చెబుతున్నారని,కానీ ఆయన పదవిలోకి వచ్చేందుకు తొక్కింది కాంగ్రెస్ నాయకులనే అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు అంటున్నారు.అసలు రేవంత్ ప్రభుత్వం ఎలా కూలిపోగలదో,ఎందుకు కూలిపోగలదో,అర్జెంటుగా కేసీఆర్ సీఎం కుర్చీలో ఎట్లా కూర్చోగలరో ఎవరికీ అంతుచిక్కదు. ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబుకేదాకా రేవంత్ ప్రభుత్వానికి వచ్చిన ప్రమాదమేమీ లేదు. 'కేటీఆర్ తో కలిసి తిరుగుతున్న వారిలో కొందరు ఎమ్మెల్యేలు మాతో టచ్ లో ఉన్నారు' అని పిసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గత శుక్రవారం ఒక బాంబు పేల్చారు.పీసీసీ అధ్యక్షుని ప్రకటన ఎనుక ఏదో భారీ వ్యూహం ఉన్నట్టు తెలుస్తోంది.కొంతమంది ఈ ప్రకటనలను మైండ్ గేమ్ గా కొట్టి పారవేస్తుండవచ్చును. కానీ బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసనసభ్యుల 'అనర్హత' కేసు మలుపులు తిరుగుతోంది. బిఆర్ఎస్ ఆశించిన ఊరట హైకోర్టులో దొరకలేదు. ఇక సుప్రీంకోర్టు తలుపులు తట్టడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది.అయితే కోర్టులు,అసెంబ్లీ స్పీకర్ కోర్టులోకి బంతిని విసిరేసే అవకాశాలున్నవి.కనుక ఈ అనర్హత కేసులు మళ్ళీ ఎన్నికల దాకా కొలిక్కి రావచ్చు,రాకపోవచ్చు.అంతిమంగా స్పీకర్ నిర్ణయమే తుది తీర్పు కానుంది. 'తొక్కుకుంటూ' రావడం అన్నది ఇప్పుడు హాట్ టాపిక్.తొక్కడం,తొక్కుకుంటూ రావడం అంటే చాలా అర్థాలున్నవి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషలో దీనర్థం,తనపైన,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపైన, ప్రజాస్వామిక హక్కులపైన అణచివేత,నిర్బంధాలు,తప్పుడు కేసులపైన 'ధిక్కార స్వరం'తో తొక్కడమని అర్థం. బిఆర్ఎస్ నాయకులను తొక్కుకుంటూ రావడం.

'తొక్కుకుంటూ రాకపోతే బిఆర్ఎస్ వృక్షాన్ని కూకటి వేళ్ళతో పెకిలించి పారవేయడం సాధ్యమేనా'?కేసీఆర్ వంటి దిగ్గజ నాయకుడ్ని అధికారం నుంచి అమాంతం ఎత్తి కిందకు తోసి పారవేయడం జరిగే పనేనా?అర్థబలం,అంగబలం,రాజకీయ టక్కు టమారాల్లో ఆరితేరిన నైపుణ్యం పుష్కలంగా ఉన్న భారత రాష్ట్ర సమితిని అసలు ఎదుర్కోవడమే ఒక సాహసం. కేసీఆర్ ను ఎదుర్కొని నిలబడడం,నిలబడి కలబడడం,విజయం సాధించడం అంటే ఇక ఎంతటి నేర్పరితనం,ఎంతటి సమయస్ఫూర్తి ఉండాలో సులభంగా ఊహించవచ్చును. అలాగే, తొక్కాలని చూస్తే తొక్కించుకునే రకం కాదు రేవంత్ రెడ్డి.తొక్కతీసే రకం.



దాదాపు నాలుగేండ్లుగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఇది తెలుస్తూనే ఉన్నది.రేవంత్ సక్సెస్ మంత్రం అదే. తన చుట్టూ ఎన్ని ప్రతికూల పరిస్థితులు కమ్ముకున్నా ,ఉప్పెనలు,తుపానులు ముంచెత్తినా వాటి నుంచి బయటపడి ఆకాశమంత ఎత్తునకు సులభంగా ఆయన ఎగరగలడు.కాగా 2018 నుంచే తెలంగాణ రాజకీయాల్లో 'కేసీఆర్,రేవంత్ మధ్య యుద్ధం 'వంటి వాతావరణాన్నే తెలంగాణ సమాజం చూస్తోంది.ఆ వాతావరణాన్ని చాలామంది అర్థం చేసుకోలేదు.గ్రహించలేదు. కొడంగల్ లో రేవంత్ ను ఓడిస్తే ఆయన భయపడిపోయి ఇక ఈ యుద్ధం నుంచి పారిపోతాడని బిఆర్ఎస్ నాయకుల్లో ఒక భ్రమ ఉండేది.కేసీఆర్ వ్యూహరచన,హరీశ్ రావు మేనేజ్ మెంటు స్కిల్స్ కారణంగా రేవంత్ ఓటమిపాలయ్యారు.అసెంబ్లీకి ఓడిపోయినా బాధపడలేదు.కుంగిపోలేదు.మనోవ్యధతో మంచం పట్టలేదు.ఇంటికే పరిమితం కాలేదు. మల్కాజిగిరి నుంచి లోక్ సభకు పోటీ చేసి ఎన్నికయ్యారు.తనను కింద పడేశామనుకున్న ప్రత్యర్థుల్ని చూసి రేవంత్ నవ్వుకున్నాడు.మళ్ళీ పైకి లేచి కేసీఆర్ పై యుద్ధానికి సిద్ధమయ్యారు.తనను రాజకీయంగా ఎంత అణచివేయాలని కేసీఆర్ కుటుంబసభ్యులు ప్రయత్నించినా మళ్ళీ,మళ్ళీ పైకి లేవడంలోనే ఆయన గెలుపు సూత్రముంది. తెలంగాణలో 'కాంగ్రెస్ పార్టీ పనైపోయింది' అన్నసీన్ నుంచి,కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు అందించి,తన నాయకత్వ ప్రతిభను మేళవించి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. అసెంబ్లీ ఎన్నికలలో కేసీఆర్ ఎత్తులకు పైఎత్తులు వేసి ఉండకపోతే అధికారం కాంగ్రెస్ పార్టీకి దక్కేది కాదు. రేవంత్‌రెడ్డి దూకుడుతోనే కేసీఆర్ పార్టీ చిత్తయిందన్న విషయంలో భిన్నాభిప్రాయాలేమీ లేవు.అయితే క్రెడిట్ మొత్తం రేవంత్ రెడ్డి ఖాతాలో వేస్తే పార్టీ సీనియర్లకు ఆగ్రహం వస్తుండవచ్చు.పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉమ్మడిగా తలపడి కేసీఆర్ ను ఫార్మ్ హౌజ్ కు పంపించారు. "గుడి లేని ఊరు లేదు,కేసీఆర్ పథకం చేరని ఇల్లు లేదు.మిమ్మల్ని కాదనుకొని చేజేతులా తినే కూటిలో మన్ను పోసుకున్నామని తెలంగాణ సమాజం తల్లడిల్లుతున్నది.నోటికాడి బుక్కను నేలపాలు చేసుకున్నామని పశ్చాతాపపడుతోంది. ఇప్పుడు సారే రావాలి.కారే గెలవాలని తెలంగాణ కలవరిస్తున్నది'' అని బిఆర్ఎస్ 'సుపారీ' మీడియాలో ఒక పోస్టును ఇటీవల చూశాను. ఇటువంటి పోస్టులు వేలు,లక్షల సంఖ్యలో బిఆర్ఎస్ మీడియాలో 'కుమ్మి పారేస్తున్నారు'.తమ అభిప్రాయమే,ప్రజల అభిప్రాయంగా మలచడానికి,తమ మాటే ప్రజల మాటగా ,తమ నిర్ణయమే ప్రజల నిర్ణయంగా 'ప్రాపగండ' చేయడంలో ఆ పార్టీ నాయకులు సిద్ధహస్తులు.'నోటి కాడి బుక్కను నేల పాలు చేసుకున్నామని, ప్రజలు పశ్చాత్తాపానికి గురవుతున్నట్టు' గా చేస్తున్న ప్రచారం విషప్రచారమే! అంటే కేసీఆర్ రావాలని,ఆయన అత్యవసరంగా సీఎం కావాలని కోరుకుంటున్నట్టుగా ప్రజల్ని మానసికంగా సిద్ధం చేస్తున్నట్టు భావించాలి. ''మేము గేట్లు తెరిస్తే బీఆర్ఎస్ ఖాళీ అవుతుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానించిన కొద్ది రోజులకే 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీని వదిలి కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు.లెక్క ప్రకారం మరో 16 మంది ఎమ్మెల్యేలు కూడా బిఆర్ఎస్ నుంచి వెలుపలికి రావాలి.కానీ వాళ్ళకు కేసీఆర్ ఎలా 'బ్రేకు' వేశారో అంచనా వేయడం కష్టం కాదు.రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎలాంటి 'ముప్పు' రాకుండా ఉండాలంటే రాజకీయ సుస్థిరత అవసరం.కాంగ్రెస్ పార్టీ వైపు

> ప్రజల్ని బిఆర్ఎస్ సోషల్ మీడియా ప్రభావితం చేస్తోందని ఆదిలాబాద్ నుంచి మహబూబ్ నగర్ దాకా కాంగ్రెస్ పార్టీలో ఒక టాక్ ఉన్నది. ప్రజలను 'బ్రెయిన్ వాష్' చేయడంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు వంటి వారు నిష్ణాతులు.'థాట్ పోలీసింగ్' లో వారు దిట్ట.

> వరంగల్,వేములవాడ సభలు విజయవంతం కావడం రేవంత్ ఇమేజ్ ను పెంచింది.దీన్ని భరించడం బీఆర్ఎస్ కు దుర్భరంగా ఉన్నది. రేవంత్ పై 'పగ,ప్రతీకారం' తీర్చుకోవాలన్న కసి బిఆర్ఎస్ లో క్షణ క్షణం పెరిగిపోతోంది.

75 మంది ఎమ్మెల్యేలు ఉన్నందున ఇప్పటికిప్పుడు ప్రమాదమేమీ లేకపోయినా,బిఆర్ఎస్ లో 'చీలిక' తీసుకు రావలసి ఉన్నది.బిఆర్ఎస్ బలహీనపడడంలోనే,కాంగ్రెస్ ప్రభుత్వ సుస్థిరత ఆధారపడి ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.బహుశా మంత్రివర్గ విస్తరణ తర్వాత కనీసం 15 మందికి పైగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైందంటూ ఒక ప్రచారం సాగుతున్నది.అదే నిజమైతే బిఆర్ఎస్ పార్టీలో సంక్షోభ పరిస్థితులు తలెత్తవచ్చు. కాగా వరంగల్,వేములవాడ సభలు విజయవంతం కావడం రేవంత్ ఇమేజ్ ను పెంచింది.దీన్ని భరించడం బిఆర్ఎస్ కు దుర్భరంగా ఉన్నది.రేవంత్ పై 'పగ,ప్రతీకారం' తీర్చుకోవాలన్న కసి బిఆర్ఎస్ లో క్షణ క్షణం పెరిగిపోతోంది. "నువ్వు తెలంగాణలో ఒక గంజాయి మొక్కవు.నిన్ను పీకి అవతల పారేస్తం.నిన్ను ఢిల్లీకి రానిస్తలేరు.నీకు సోనియా, రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇస్తలేరు''.అని ఎర్రబెల్లి దయాకర రావు ఫైరయ్యారు.

ఎర్రబెల్లి,రేవంత్ ల మధ్య పాత 'లెక్కలున్నవి'.ఓటుకు నోటు కేసులో కేసీఆర్ కు ఎర్రబెల్లి ఇంఫార్మర్ పనిచేసినట్టు రేవంత్ ఆరోపణ.అందువల్ల ఇద్దరి మధ్య ఆనాటి నుంచే 'గొడవలున్నాయి. ఇదిలా ఉండగా ఇకపై ప్రభుత్వ పెద్దల మౌఖిక ఆదేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పాటించరాదని, నిబంధనల ప్రకారమే చేయాలని ఐఏఎస్ లు నిశ్చయించుకున్నట్టు ఒక ప్రచారానికి బిఆర్ఎస్ 'సుపారీ మీడియా' పదునుబెడుతున్నది. నవంబర్ 20 న కొందరు ఐఏఎస్ అధికారులు రహస్యంగా సమావేశమై మౌఖిక ఆదేశాలతో పని చేయాలని మంత్రుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నట్టు చర్చించారట.ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరిగిన పలు పరిణామాలను,ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను కొందరు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఈ సమావేశంలో గుర్తుచేశారట.భవిష్యత్‌లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తామే అనుభవించాల్సి ఉంటుందని అనుకున్నారట.మూడవసారి కూడా అధికారంలోకి రావడానికి గాను కేసీఆర్,ఆయన బృందం పాల్పడిన 'చట్ట వ్యతిరేక' చర్యలు,ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నవి. తాజాగా ఐఏఎస్ అధికారులకు చెందిన 'సమావేశం', 'సుపారీ మీడియా' కట్టుకథ అని కొందరు ఐఏఎస్ అధికారులు చెబుతున్నారు.పైగా కేసీఆర్ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు,కాళేశ్వరం ప్రాజెక్టు,ఫోన్ ట్యాపింగ్ వంటి భాగోతాలల్లో కొందరు సీనియర్ ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు,సీనియర్ ఇంజనీర్లు 'జైలుకు పోయే అవకాశాలు కొట్టి పారవేయలేమ'ని ఉన్నతాధికారులు అంటున్నారు.ఆనాడు కేసీఆర్,కేటీఆర్ మౌఖిక ఆదేశాలతో పనులు చక్కబెట్టిన వారే ఇలా సమావేశాలు పెట్టుకొని ప్రభుత్వంపై తమ అసహనాన్ని వ్యక్తం చేయడం ఆశ్చర్యం. బిఆర్ఎస్ 'లబ్దిదారులైన' కొందరు ఉన్నతాధికారులు 'కేసీఆర్ ఉప్పు తిన్న విశ్వాసాన్ని' మరచిపోలేకపోతున్నట్లున్నది.సాధారణంగా అతితక్కువ సందర్భాలలోనే మంత్రులు,సీఎం మౌఖిక ఆదేశాలు ఇస్తారన్నది మనకు తెలుసు.వాటిని అమలు చేయడం చేయకపోవడం అధికారుల పరిమితి, పరిధి,ఆధికారం,విచక్షణను బట్టి ఉంటుంది.ప్రభుత్వంలో ఉన్న వారెవరయినా కేవలం చట్టప్రకారమే నడుచుకున్న,నడుచుకుంటున్న ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు అరుదు.అందుకే మనం దివంగత 'ప్రజాధికారులు' యుగంధర్,ఎస్.ఆర్.శంకరన్ వంటి వారిని గుర్తు చేసుకుంటూ ఉంటాం.ఇప్పుడలాంటి వాళ్ళను కాగడా పెట్టి వెతికినా దొరకరు. 'దీపం ఉండగానే' ఇల్లు చక్కపెట్టుకున్నవాళ్ళు, యింకా చక్కపెట్టుకుంటున్న వాళ్ళు కోకొల్లలుగా కనిపిస్తున్నారు. కేసీఆర్ హయాంలో నవీన్ మిట్టల్,అరవింద్ కుమార్,జయేష్ రంజన్,సోమేశ్ కుమార్ వంటి ఉన్నతాధికారుల నుంచి అమేయ కుమార్ దాకా వారి 'లీలలు' ఏమిటో ప్రజలు గ్రహించారు.అధికారులలో 'కేసీఆర్ /కేటీఆర్ భక్తులు' వేరయా ! అన్నది నిజం.నవంబర్ 22 న కేటీఆర్ ప్రాయోజిత మీడియాగా ఆరోపణలున్న మాధ్యమాల్లో 'మౌఖిక ఆదేశాలు వినకూడదు' అని ఐఏఎస్ అధికారులు నిర్ణయించుకున్నారు. ఇంతే కాదు,కొద్ది రోజుల కిందట ఈ మాధ్యమాలలోనే 'రేపో మాపో రేవంత్ ప్రభుత్వం మారిపోవచ్చు,కూలిపోవచ్చు,ముఖ్యమంత్రి మారిపోవచ్చు.కనుక ఆచితూచి ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేయాలని ఐఏఎస్ లు ఆలోచిస్తున్నట్టు' ఒక కథనం వండి వార్చారు.రేవంత్ రెడ్డిని ఇప్పట్లో మార్చే అవకాశం లేదని,2028 ఎన్నికల దాకా ఆయనే సీఎంగా ఉంటారని తెలిసిన కొందరు మంత్రులు కూడా 'పరోక్షంగా' బిఆర్ఎస్ కు మద్దతు తెలియజేస్తున్నట్టు బిఆర్ఎస్ పార్టీలో ఒక ప్రచారం ఊపందుకున్నది.ఇదెంత నిజమో తెలియదు. ఇప్పటికే 'ఈ ప్రభుత్వం పూర్తి కాలం ఉండద'న్న ప్రచారం ప్రజలలో బలంగా తీసుకువెళ్లేందుకు ప్రతిపక్షం చెమటోడ్చుతోంది. ప్రజల్ని బిఆర్ఎస్ సోషల్ మీడియా ప్రభావితం చేస్తోందని ఆదిలాబాద్ నుంచి మహబూబ్ నగర్ దాకా కాంగ్రెస్ పార్టీలో ఒక టాక్ ఉన్నది.ప్రజలను 'బ్రెయిన్ వాష్' చేయడంలో కేసీఆర్,కేటీఆర్,హరీశ్ రావు వంటి వారు నిష్ణాతులు.'థాట్ పోలీసింగ్' లో వారు దిట్ట.'కేసీఆర్ రావలసిందే' అనే నినాదం క్షేత్రస్థాయిలో మార్మోగేలా బిఆర్ఎస్ నాయకత్వం అనేక తంటాలు పడుతోంది.బీజేపీ,బీఆర్ఎస్ కలిసి రేవంత్ సర్కార్ కూల్చే కుట్రలు చేస్తున్నారన్న ప్రచారం ప్రజల్లో విస్తృతంగా సాగుతుండడం వెనుక ఆ పార్టీ ప్రమేయం ఉన్నది.కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్నెళ్ల కు మించి ఉండదంటూ ఒకే స్వరంతో బిఆర్ఎస్,బీజేపీ మాట్లాడుతున్నవి.




- ఎస్.కే.జకీర్,
సీనియర్ జర్నలిస్ట్.

# భారత రాజ్యాంగం@75 ఏళ్లు

## ఏడాదంతా సెలబ్రేషన్స్.. నేటి నుండి ప్రారంభం

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్రం ఏడాదంతా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించింది ప్రత్యేక వెబ్‌సైట్ కూడా ఏర్పాటు చేసింది . అందులో రాజ్యాంగ పరిషత్ చర్చలు, నివేదికలు అందుబాటులో ఉంటాయని కేంద్ర సాంస్కృతిక శాఖ పేర్కొంది. నవంబర్ 26 నుంచి ఏడాది పొడవునా వేడకలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అయితే మంగళవారం పాత పార్లమెంటు భవనంలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో జరిగే 75వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షత వహించనున్నట్లు తెలిపింది. మంగళవారం నుంచి ఏడాది పొడవునా జరిగే వేడుకల్లో రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కేంద్ర సాంస్కృతిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు నగరాలు, గ్రామాలు, పాఠశాలల్లో రాజ్యాంగ ప్రవేశికను సామూహికంగా చదివించే కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. నవంబర్ 26న జరిగే రాజ్యాంగ దినోత్సవం కేవలం పార్లమెంటులో జరుపుకునే వేడుక మాత్రమే కాదని, ఇది దేశం మొత్తం జరుపుకోవాల్సిన పండుగని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాజ్యాంగాన్ని గౌరవించే వ్యక్తులుగా అందులోని విషయాలను దేశ ప్రజల ముందుకు తీసుకువస్తున్నామన్నారు. మంగళవారం రాజ్యాంగ నిర్మాతలకు నివాళులు అర్పించనున్నట్లు కిరెన్ రిజిజు పేర్కొన్నారు.




### రాజ్యాంగం ప్రవేశిక అంశంపై సుప్రీం కోర్టు కీలక తీర్పు

మరోవైపు, రాజ్యాంగ ప్రవేశిక అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలగించాలని దాఖలైన పిటిషన్లను సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం కొట్టివేసింది. రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకిక అనే పదాలను జోడిస్తూ 1976లో చేసిన 42వ సవరణను సవాల్ చేస్తూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు పిటిషన్లు వేశారు. ఆ సవరణపై పార్లమెంట్‌లో చర్చ జరగలేదని వాదించారు. ఎమర్జెన్సీ సమయంలో చేసిన ఆ సవరణల చట్టబద్ధతను పిటిషన్‌లో ప్రశ్నించారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు నవంబర్ 22న తీర్పు రిజర్వ్ చేసి, తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేసింది. ఆ పదాలకు వివిధ వివరణలున్నాయని, వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని గత విచారణలో సుప్రీం అభిప్రాయపడింది. సోషలిజం అంటే అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వాన్ని ఇది ప్రతిబింబిస్తుందని తెలిపింది. దాన్ని మరో రకంగా చూడకూడదని హితవు పలికింది. సెక్యులర్ అనే పదం అంతేనని పేర్కొంది.

### రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

ANN తెలుగు
మహా పత్రిక 05
మంగళవారం, హైదరాబాద్ | 26-11-2024 | జిల్లాల వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM

# గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దు

- 31దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ దివాకర
- వికలాంగుని వద్దకే వెళ్లి దరఖాస్తు తీసుకున్న కలెక్టర్



**ములుగు, మహా:** వివిధ సమస్యలతో కలెక్టరేట్ కు వచ్చి గ్రీవెన్స్ లో ఇస్తున్న దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్ లో ప్రజల నుంచి 31 దరఖాస్తులను అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జీ, ఇన్చార్జి అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్ లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవచేయడం అదృష్టంగా భావిస్తూ దరఖాస్తుల నివృత్తికి కృషి చేయాలన్నారు. దరఖాస్తులను కూలంకుశంగా పరిశీలించి పరిష్కరించడంతో పాటు అందుకు సంబంధించిన ప్రోగ్రెస్ ను దరఖాస్తు దారునికి తెలియజేయాలన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్ ఓ ఎన్.గోపాల్ రావు, సీపీవో ప్రకాష్, డీడీ పోచం, డీసీవో సర్దార్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఈఓ జి.పాణిని, తదితరులు పాల్గొన్నారు. కాగా, తన సమస్యను పరిస్కరించాలని కోరుతూ కలెక్టరేట్ కు వచ్చిన వికలాంగుడు కార్యాలయంలోకి వచ్చేందుకు ఇబ్బంది పడుతుండగా కలెక్టర్ దివాకర వికలాంగుని వద్దకే వచ్చి దరఖాస్తు స్వీకరించారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# భద్రాద్రి అభివృద్ధికి కృషి చేస్తా

**: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**కొత్తగూడెం, నవంబర్ 25, మహా:** రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అభివృద్ధి పరంగా ఆదర్శంగా నిలపడమే కాకుండా, ధనిక జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొత్తగూడెంలో పర్యటనలో భాగంగా మొదట నందతండా నుంచి వికలాంగుల కాలనీ వరకు నిర్మాణం చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకటరావుల తో కలిసి ప్రారంభించారు. అనంతరం రూ.1.50 కోట్లతో కొత్తగూడెంలో నిర్మాణం చేసిన గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. అక్కడ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గ్రంథాలయాల్లో ప్రధానంగా సమకాలిక అంశాలకు సంబంధించిన పుస్తకాలతోపాటు గత చరిత్ర తెలిపేలా పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచడం వల్ల విద్యార్థులు, అభ్యర్థులకు ప్రయోజనం చేకూరుతుందని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్నటువంటి 600 గ్రంథాలయాలను పునరుద్ధరించాలని వాటిలో అవసరమైన పుస్తకాలతో పాటు ఫర్నిచర్, మౌలిక వసతులను సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వనరులకు నిలయంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూనే, వైద్యం, రహదారుల ఏర్పాటు వంటి పనులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ రియాజ్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మీ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ట్రైబల్, హోంశాఖల మంత్రులు లేని తెలంగాణ

- బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్



**ములుగు, మహా:** తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడాది సమీపిస్తున్నా కూడా ట్రైబల్, హోం శాఖల మంత్రులు లేకపోవడం పాలకుల పరిపాలనకు అద్దం పడుతోందని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి, ములుగు జిల్లా ఇన్చార్జి గుగులోతు మదన్ ఆరోపించారు. సోమవారం ములుగులో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు అధ్యక్షతన మెంబర్ షిప్ డ్రైవ్లో భాగంగా జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మదన్ మాట్లాడారు. లగచర్లలో పేదల ఇళ్లు లాక్కొని స్థానిక ప్రజలను హింసిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలని, నిరుద్యోగ భృతి కల్పించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సభ్యత్వ నమోదులో ముందుండాలని, ప్రతీ మండలానికి యాక్టీవ్ మెంబర్షిప్ చేయాలని, జిల్లాలో సభ్యత నమోదు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొత్త సురేందర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి హరీష్, ఉపాధ్యక్షుడు దుగ్గినేని భాను, అధికార ప్రతినిధి విక్రాంత్, బీజేవైఎం నాయకులు బొజ్జ సిద్ధార్థ, అప్పాని సురేష్, మేరుగు మణికంఠ, రవితేజ, సిద్ధూ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# నాయకపోడ్ల చరిత్రలకు గట్టమ్మ తల్లి మూలం

- సమ్మక్క, సారలమ్మ పరిశోధన బృందం సభ్యులు



**ములుగు, మహా:** ఆదివాసీ నాయకపోడ్ ల చరిత్ర మొత్తం గట్టమ్మ మూలంతో ముడిపడి ఉందని శ్రీ సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ పరిశోధన బృందం డైరెక్టర్ కాక నర్సింగరావు, జాయింట్ డైరెక్టర్ బుగ్గ కోటేశ్వర్ రావులు సూచించారు. ములుగులోని గట్టమ్మ ఆలయ పరిసరాల్లో రెండు రోజులపాటు పరిశోధన బృందం సభ్యులు నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్, గట్టమ్మ పూజారులతో కలిసి చరిత్రపై పరిశోధనలు చేశారు. అందులో భాగంగా సోమవారం సైతం గట్టమ్మ వద్ద పరిశోధన చేసిన వారు పలు చారిత్రక అంశాలను గుర్తించారు. ఈ సందర్భంగా బృందం డైరెక్టర్ నర్సింగరావు, జాయింట్ డైరెక్టర్ కోటేశ్వర్ రావు, ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కుర్సం రవిలు మాట్లాడుతూ.. గొంతెమ్మ, గట్టమ్మ, లక్ష్మీదేవరల చరిత్రను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గట్టమ్మతల్లికి చరిత్ర లేదని ఆరోపణలు చేసేవారు నాయకపోడ్ ల చరిత్ర గట్టమ్మతల్లి మూలాలతో ముడిపడి ఉందనే చారిత్రక విషయాలను గుర్తించాలన్నారు. పరిశోధన బృందం సేకరించిన తాలపత్ర మూలాల్లో ఉన్న ఆధారాలతో నాలుగు కిలోమీటర్ల మేర పర్యటించి పురాతన చరిత్ర కలిగిన కొండలు, గృహలు, కోనేరులను గుర్తించామని స్పష్టం చేశారు. ఆదివాసీ నాయకపోడ్ ల చరిత్రను బహిర్గతం చేస్తూ ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రభుత్వం సైతం కృషి చేయాలని కోరారు. మేడారం సమ్మక్క తల్లికి అంగరక్షకులుగా ఉనన్ ఐదుగురిలో గట్టమ్మ దేవర ముఖ్యమని పేర్కొన్నారు. నాయకపోడు తెగలోని పూర్తి వంశ వృక్షం, గోత్రాల ఏర్పాటు, తెగలోని ఇంటి పేర్లు ఎలా వచ్చాయనే చరిత్ర ఆదివాసీలు, నాయకపోడ్ వారసులు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం లక్ష్మి దేవరల గుళ్ళ రక్షణకు పాటు పడాలని, తమ సంస్కృతిని రక్షించాలని, గట్టమ్మ సన్నిధిలో మ్యూజియం ఏర్పాటు చేయాలని పరిశోధన కేంద్రం సభ్యులు కోరారు. ఈ పరిశోధనలో సభ్యులు గట్టిపల్లి అర్జున్, కాక నితిన్, ఉనేని మధు, గట్టమ్మ ప్రధాన పూజారులు కొత్త సదయ్య, కొత్త లక్ష్మయ్య, అరిగెల సమ్మయ్య, ఆకుల మొగిలి, కొత్త సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 25, మహా :** విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ట్రైబల్ మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉన్న పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణమ్మతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దారులు, ఎంపీడీవోలు, ఎంఈఓ లు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని హాస్టల్స్ ను జిల్లా మరియు మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని హాస్టల్స్ ను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అధికారులందరూ తమ పరిధిలోని హాస్టల్స్ ను వ్యక్తిగతంగా వెళ్లి పరిశీలించి, హాస్టల్స్ లో నెలకొన్న పరిస్థితులు ఉన్న సమస్యలపై ఫొటోలతో కూడిన నివేదిక అందించాలన్నారు.

# గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



**అశ్వారావుపేట, నవంబర్ 25, మహా:** అశ్వారావుపేట మండలంలోని పాలగుంపు గ్రామంలో గిరిజన వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని వినాయకపురం గ్రామస్తులు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బెర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన పాలగుంపులో సుమారు 38 కుటుంబాలకు చెందిన వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా బెర్రం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, చలికాలంలో వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఇటువంటి కార్యక్రమాలను గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా వృద్ధులకు దుప్పట్లను వితరణ చేశామన్నారు. ప్రతి సంవత్సరం ఇదేవిధంగా ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలను కొనసాగించేందుకు కృషి చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండా రాజులు, కాకా సత్యనారాయణ, సున్నం వెంకటేశ్వరరావు, గొంది కృష్ణ, గొంది వెంకటేశ్వరరావు, కాకా మధు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# చలి గుప్పిట్లో అశ్వారావుపేట



**అశ్వారావుపేట, నవంబర్ 25, మహా:** అశ్వారావుపేట మండలంలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. మండల వ్యాప్తంగా చలి గాలులు వీస్తుండగా, ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో, ముఖ్యంగా గ్రామాల్లో చలి మరింత ఎక్కువగా ఉంటుంది. గత రాత్రి అశ్వారావుపేటలో కనిష్టంగా ఉష్ణోగ్రత నమోదైంది. మండల కేంద్రంలోని పలు వీధుల్లో చలిని తట్టుకునేందుకు ప్రజలు చలిమంటలు వేస్తున్నారు. పగటిపూట కూడా ఉష్ణోగ్రత తక్కువగా ఉండటంతో ప్రజలు చలికి గజగజలాడుతున్నారు. ఈ చలి తీవ్రత వల్ల సీజనల్ వ్యాధులు మండల ప్రజలను వేధిస్తున్నాయి. పలు గ్రామాల్లో జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

# క్రమశిక్షణతో పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుంది

**: ఎస్పీ రోహిత్ రాజు**



**కొత్తగూడెం, నవంబర్ 25, మహా:** భద్రాచలం పోలీస్ స్టేషన్ లో గంజాయి అక్రమ రవాణా కేసుల్లోని నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుధీర్ లకు ఇటీవల రాష్ట్ర డీజీపీ డా. జితేందర్ తమ కార్యాలయంలో రివార్డులను అందజేశారు. రివార్డులను అందుకున్న అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఆయన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. 2023 సంవత్సరంలో ప్రభుత్వం నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ భద్రాచలం పోలీస్ స్టేషన్లో పట్టుబడిన నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేవిధంగా కృషి చేసిన ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుదీర్ లను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతతో పోలీస్ శాఖలో పనిచేసేవారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి పాల్గొన్నారు.

# ఘనంగా కార్తీక వనభోజనాలు



**కొత్తగూడెం, నవంబర్ 25, మహా:** కొత్తగూడెం కమ్మ సేవ సమితి కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. వనబోజనాల కార్యక్రమాన్ని కమ్మ కులస్తులు సోమవారం కొత్తగూడెం ఫారెస్ట్ సెంట్రల్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు కుల పెద్దలు నీవాలులు అర్పించారు. ఆధ్యాత్మికత, ఐక్యతకు స్నేహభావాలకు కార్తీకమాస వనభోజన మహోత్సవాలు ప్రతీకలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వనభోజన మహోత్సవాల్లో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ప్రజలందరికీ కార్తీక మాస శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గ, జిల్లా వ్యాప్తంగా కార్తీక మాస వన భోజన మహోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్తీక మాస వనభోజన మహోత్సవాల ద్వారా ఆధ్యాత్మిక భావాలు సభ్యుల మధ్య సోదర భావాలు పెంపొందుతాయన్నారు. సామాజిక సేవా రంగాల్లో కొత్తగూడెం కమ్మ కులస్తులు అగ్రస్థానంలో నిలిచి ఆదర్శంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం కుల పెద్దలు, భద్రాచలం కమ్మ అధ్యక్షులు, ఇల్లందు డి వెంకటేశ్వర్లు, కోనేరు పూర్ణచంధర్, రాష్ట్ర కమ్మ కార్యదర్శి తదితరులు కమ్మ కులస్తులు పాల్గొన్నారు.

## పాల్వంచ మున్సిపాలిటీ
# ఎన్నికలు నిర్వహించాలి




**కొత్తగూడెం/పాల్వంచ, నవంబర్ 25, మహా:** పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని, పట్టణంలో రద్దు చేసిన రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జెట్టి ఆనందరావు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ నాయకుడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేగా గెలిపిస్తే పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇవ్వడం, గెలిచాక అమలు చేయకపోవడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పుడు ఉన్న శాసన సభ్యులు గతంలో 2009లో కూడా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అదేవిధంగా పాల్వంచ పట్టణ పరిధిలో గల 727, 817, 444, 999 సర్వే నెంబర్లలో గత ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని, రిజిస్ట్రేషన్ లు నిలిచిపోవడంతో అమ్మకాలు, కోనుగులు జరగక లోన్ లు రాక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, గెలిచాక జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తానని ప్రకటించిన హామీని, ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, కటికాల రంజిత్, వంగా రవిశంకర్, ఈసం మురళి తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో ఎమ్మెల్యే మట్టా పూజలు



**సత్తుపల్లి, నవంబర్ 25, మహా:** మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామ శివాలయంలో కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి అన్న ప్రసాదాలు స్వీకరించారు. పూజకు హాజరైన ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో గౌరవంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ, కాకర్లపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# దేవాలయ భూములపై సర్వే. !



**నేలకొండపల్లి, నవంబర్ 25, మహా:** మండలం కేంద్రంలోని శ్రీ రాజగోపాలస్వామి దేవాలయంకు చెందిన భూములపై సోమవారం సర్వే ప్రారంభించారు. సింగారెడ్డిపాలెంలో రెవెన్యూ పరిధిలో దేవాలయానికి 15.20 ఎకరాల సాగు భూమి ఉంది. కాగా, ఈ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని పలువురు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం దేవాదాయ శాఖ ఈవో శ్రీకాంత్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ప్రభుత్వ సర్వేయర్ రాంబాబు దేవాలయం భూములను పరిశీలించారు. దేవాలయంకు చెందిన భూములకు హద్దులను నిర్ణయించారు. చుట్టు ప్రక్కల రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా దేవాలయంకు చెందిన భూములను కౌలుకు తీసుకున్న రైతులు కూడా వేలం పాటలో పాడిన సరిపడ భూమి కనిపించటం లేదని ఆరోపణలు చేశారు. దేవాలయం భూములను ఆక్రమణ చెర నుంచి కాపాడాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి దేవాలయం మాజీ చైర్మన్ రాయపూడి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దోసపాటి శేఖర్, రైతు ప్రతినిధులు పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, విష్ణు, పూజారి ముదుంబ రామానుజాచార్యులు, సిబ్బంది కళ్యాణి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల అలసత్వంతో నష్టపోతున్న చేతి వృత్తిదారులు




**మధిర/ఎర్రుపాలెం, నవంబర్ 25, మహా:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా 14 రకాల చేతి వృత్తిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించి కొద్దిమంది లబ్ధిదారుల దరఖాస్తులు మాత్రమే ఆన్ లైన్ చేసి, మరికొద్ది లబ్ధిదారుల దరఖాస్తులు ఆన్ లైన్ చేయకపోవడం వలన చేతి వృత్తిదారులు నష్టపోతున్నారని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య విమర్శించారు. మండల కేంద్రంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిన్న మండల స్థాయి ప్రజావాణిలో తహశీల్దార్ మన్నే ఉషా శారదకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేతివృత్తిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తిదారుల నుండి దరఖాస్తులను పొందిన కొన్ని గ్రామ పంచాయతీల నందు లబ్ధిదారుల దరఖాస్తులను నమోదు చేయకపోవడం వలన శిక్షణకు పిలవలేదని తెలిపారు. ధరఖాస్తు పెట్టుకున్న లబ్ధిదారులు పనులు మానుకొని మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, చేతి వృత్తిదారులు ఇచ్చిన దరఖాస్తులన్నిటిని వెంటనే ఆన్ లైన్ ఐడీలో నమోదు చేసి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చేతి వృత్తిదారుల సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ప్రభాకర్, గామాసు జోగయ్య, నాగులవంచ వెంకటరామయ్య, దూదిగం బసవయ్య, నాగేశ్వర రావు, నాగరాజు, మోహన్ రావు నాగులవంచల నాగరాజు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# ఊరంతా వనభోజనాలు

**నేలకొండపల్లి, నవంబర్ 25, మహా:** మండలంలోని మంగ్రాజుపల్లి గ్రామస్తులు ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం వన సమారాధన కార్యక్రమాలు సామాజిక వర్గాలు వారీగా, పార్టీల వారీగా నిర్వహిస్తున్న వేళ వాటికి గ్రామస్తులు చెక్ పెట్టారు. గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసుకుని... సామూహిక కుల వన సమారాధన కార్యక్రమంను నిర్వహించారు. సోమవారం స్థానిక పాండయ్య మామిడి తోటలో నిర్వహించిన కార్యక్రమానికి 600 మంది హాజరయ్యారు. సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు, చిన్నారులు ఆటా, పాటలతో సందడి చేశారు. వనసమారాధన కార్యక్రమాన్ని ఊరంతా కలిసి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వహకులను గ్రామస్తులు అభినందించారు. గ్రామ పెద్దలు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డేటా ఎంట్రీని సకాలంలో పూర్తి చేయాలి



**నేలకొండపల్లి, నవంబర్ 25, మహా:** సమగ్ర సర్వే డేటా ఎంట్రీ నమోదును నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సర్వే పాలేరు నియోజకవర్గ ఇన్ చార్జి నూరుద్దీన్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా చేయాలని ఆదేశించారు. సర్వే డేటా ఎంట్రీ నమోదును శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మండలస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామాలలో మిగిలిన కుటుంబాల సర్వేను యుద్ధ ప్రాతిపధికన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె. మాణిక్యరావు ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు పేదలకు చేరేందుకే సమగ్ర సర్వే



**బోనకల్, నవంబర్ 25, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేతో రాష్ట్రంలోని ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాలి దుర్గారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరుగుతున్న సమగ్ర సర్వేలో పాల్గొన్న అనంతరం మహాతో తన అనుభవాన్ని పంచుకున్నారు. సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన మొదలైన వివరాలతో పొందుపరచబడిన సమగ్ర సర్వే బుక్ లెట్ ద్వారా ప్రజలకు సంబంధించిన వివరాలను సేకరించి భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఎంత ఉండాలో ఈ డేటా ఆధారంగానే ఖరారు చేయనున్నారని ఆయన అన్నారు.మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే చివరి దశలో ఉందని తెలిపారు. సమగ్ర సర్వేపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మొద్దని హితవు పలికారు.

# మండల పరిషత్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



**బోనకల్, నవంబర్ 25, మహా:** మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ సందర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీకి సంబంధించిన వివరాలను ఎంపీడీఓ రూరావత్ రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే వివరాలను పకడ్బందీగా ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. పంచాయతీ సెక్రెటరీ, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పొలం గట్టున రైతులతో కలెక్టర్

**- పంట వివరాలు ఆరా**

**ఖమ్మం, నవంబర్ 25, మహా:** వరి పంట కోతను పరిశీలించి, పొలం గట్టున రైతులతో కూర్చొని పంట దిగుబడి, వ్యవసాయ వివరాలను, సమస్యల గురించి రైతులతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడి ఆరా తీశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తల్లాడ మండల కేంద్రంలో పర్యటించి మంగాపురం రోడ్డులో ఉన్న తమ్మిశెట్టి లక్ష్మీనర్సయ్య రైతు పొలంలో జరుగుతున్న వరి పంట కోతలను పరిశీలించి, అక్కడున్న రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని వరి కోతల మిషన్ పై కూర్చొని వరి కోతలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ధాన్యం పంట విస్తీర్ణం, వస్తున్న దిగుబడి, కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుంది, ధాన్యం డబ్బులు సకాలంలో వస్తున్నాయా, రైస్ మిల్లర్ల దగ్గర ఏదైనా కోతలు జరుగుతున్నాయా, అధికారుల స్పందన వంటి వివరాలను తెలుసు కున్నారు. వరి కోతల యంత్రం తమిళనాడు నుంచి వచ్చిందని తెలుసుకున్న కలెక్టర్ గంట సమయానికి ఎంత విస్తీర్ణంలో పంట కోత జరుగుతుంది, ఎంత డబ్బులు అవుతాయి వంటి వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రైతు పొలంలో గట్టు పై రైతులతో కూర్చొని మాట్లాడారు. సాగునీటి వసతి ఎలా ఉంది, విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నాయా, గ్రామాలలో త్రాగు నీటి సరఫరా సరిగా జరుగుతుందా వంటి అంశాలను ఆరా తీశారు. ధరణికి సంబంధించి సమస్యలు ఉన్నాయా అని అడిగి, కలెక్టరేట్ లో ధరణి సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దరఖాస్తుల సమర్పణ విషయంలో వారి సహకారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం అవసరమైన వసతులు కల్పిస్తుందని, ప్రైవేట్ కు ధీటుగా విద్యా బోధన చేస్తున్నామని, ప్రభుత్వ వ్యవస్థలపై విశ్వాసం ఉంచి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట తల్లాడ మండల వ్యవసాయ అధికారి ఎండీ తాజోద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారులు బి. మురళీకృష్ణ, బి. సాయి కుమార్, జి. శివకుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలు త్వరగా పరిష్కరించాలి

**▪ అదనపు కలెక్టర్లు**

**ఖమ్మం, నవంబర్ 25, మహా :** ప్రజావాణి అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలు సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేట గ్రామానికి చెందిన కూచిపూడి సన తన ఇల్లు వరదల్లో కొట్టుకుపోయిందని, తన పేరు సెకండ్ లిస్టులో సీరియల్ నెంబర్ 81 లో ఉన్నదని, తనకు ఇంతవరకు ఎటువంటి సహాయం రాలేదని, తనకు సాయం అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారిణి అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మహా పాదయాత్రను విజయవంతం చేయండి



**ఖమ్మం సిటీ, నవంబర్ 25, మహా:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో కరీంనగర్ నుండి వేములవాడ వరకు ఈనెల 27 , 28 తేదీలలో నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె వి కృష్ణారావు కోరారు. సోమవారం ఖమ్మం నగరంలో అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నసరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె వి కృష్ణారావు హాజరైమాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు ఫోరం ఆధ్వర్యంలో కరీంనగర్ నుండి వేములవాడ వరకు ఈనెల 27 , 28 తేదీ లలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి అని కోరుతూ ఈ మహాపాద యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయకత్వంలో ప్రారంభం కాబోతుందన్నారు. ఈ కార్ర్యమంలో రవిచంద్ర చౌహాన్, రాచమల్లు ఉమా యాదవ్, వడ్డే బోయిన వరలక్ష్మి , పెల్లూరి విజయ కుమార్, కామని అనంత లక్ష్మి, స్వరూప, పద్మ, ధనలక్ష్మి, ఆకారపు కృష్ణ వేణి, యకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రాణాలకే ముప్పు

**ఖమ్మం క్రైమ్ , నవంబర్ 25, మహా :** సెల్ ఫోన్ డ్రైవింగ్ ద్వారా తమ విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడుతుందని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. నగరంలో సోమవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడుపుతూ పట్టుబడిన 45 వాహనదారులకు జరిమానా విధించిన ట్రాఫిక్ పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ... నగరంలో సెల్ఫోన్ డ్రైవింగ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలోనే సెల్ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని హెచ్చరిస్తున్నా వాహనదారులు సిరియస్ గా తీసుకోవడం లేదని అన్నారు. వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడటం, చాటింగ్ చేయడం, ఒకే చేత్తో డ్రైవింగ్ చేస్తూ అకస్మాత్తుగా స్పీడ్ బ్రేకర్లు, ఎదురుగా ఏదైనా వస్తే వాహనం మీద నియంత్రణ కోల్పోయి అదుపు తప్పి ప్రమాదాలు బారిన పడుతూ.. ఎంతోమంది ప్రాణాలూ పోగొట్టుకుంటున్నారని అన్నారు. అజాగ్రత్తగా ఉంటే ప్రాణం పోతుందని తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, వాహనం ఎటువైపు వెళ్తుందనే ధ్యాస లేకపోవడంతోపాటు వెనుక నుంచి వచ్చేవారికి ఇబ్బంది కలుగుతుందన్న ఆలోచనా కూడా ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మోహన్ బాబు, ఆర్ఐ సాంబశివరావు, ఎస్సైలు రవి, సాగర్, వెంకన్న, రాము పాల్గొన్నారు.



## జమలాపూరం ఆలయ ధార్మిక భవనం ప్రారంభం

**ఎర్రుపాలెం, నవంబర్ 25, మహా:** మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ధార్మిక భవనాన్ని ఈవో కొత్తూరు జగన్మోహన్ రావు, ధర్మకర్త శ్రీ రామచంద్రమూర్తి తో కలిసి దాత చిన్నం రామకోటయ్య సోమవారం ప్రారంభించారు. ఆలయ దేవస్థాన పరిపాలనకు సంబంధించిన కార్యకలాపాలకు కార్యాలయం నిర్మించాలని ఆలయ అధికారులు, అర్చకులు కోరగానే ఏపీలోని ఏలూరు జిల్లా చాట్రాయి గ్రామానికి చెందిన నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య స్పందించారు. ధార్మిక భవనం నిర్మాణానికి ముందుకొచ్చి సుమారు రూ.65 లక్షలతో వారి తండ్రి చిన్నం సుబ్బారావు జ్ఞాపకార్థం అన్ని వసతులు, హంగులతో కార్యాలయ నిర్మాణాన్ని సంవత్సర కాలంలోనే పూర్తిచేసి దేవస్థానముకు అప్పగించారు. దాత మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ఏదో ఒక నిర్మాణం చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాని ధార్మిక భవన నిర్మాణానికి అవకాశం రావడం శ్రీవారికి సేవగా తాను భావిస్తున్నట్లు తెలిపారు. దేవాలయ సిబ్బంది దాతను సత్కరించి భవిష్యత్ లో కూడా దేవాలయ అభివృద్ధికి సహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వకుళాభరణం స్టేడియం నిర్మాణ దాత తుళ్ళూరి కోటేశ్వరరావు,ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్ శర్మ, సూపరిండెంట్ కే విజయకుమారి, నిర్మాణ నిర్వాహకుడు ఉప్పల రాజీవ్ శర్మ ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో పోలీసు జాగిలం మృతి



**ములుగు, మహా:** ములుగు జిల్లాలో పోలీసు శాఖకు తనదైన సేవలు అందించిన పోలీసు జాగిలం స్కాంపర్ అనారోగ్యంతో మృతిచెందింది. జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్, ఇతర అధికారులు జాగిలంకు శాఖాపరమైన గౌరవవందనం అందించి నివాళులర్పించారు. జిల్లాలో పోలీసు శాఖ తరఫున సుదీర్ఘ సేవలు అందించిన స్కాంపర్ కు మోయినాబాద్ ఐఐటిఏ లో శిక్షణ ఇచ్చారు. అనంతరం 2018లో ములుగు జిల్లా డాగ్ స్క్వాడ్ బృందంలో చేరి ఆరేళ్లుగా మందు పాతరలు కనిపెట్టడంలో కీలక సేవలు అందించింది. కిడ్నీల సమస్యతో చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు అధికారులు వెల్లడించారు. జాగిలానికి జిల్లా ఎస్పీతోపాటు అధికారులు జాకారం పీటీసీలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, ఆర్ఐలు సంతోష్, వెంకట్ నారాయణ, తిరుపతిరెడ్డి, ఆర్ఎస్ఐలు, డాగ్ స్క్వాడ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు

**ఖమ్మం, నవంబర్ 25, మహా:** నేడు, రేపు.. రెండు రోజులపాటు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా నవంబర్ 26న ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో, నవంబర్ 27న ఖమ్మం రూరల్ మద్ది ఎల్లారెడ్డి ఫంక్షన్ హాలులో జయ జయహే ప్రజా పాలన అనే కళాబృందం అలేఖ్య సారథ్యంలో సాయంత్రం 6.00 గంటల నుండి వివిధ కళా రూపాలలో ప్రభుత్వ కార్యక్రమాలు, గత సంవత్సరకాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాలకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు



**చర్ల, మహా:** కార్తీక మాసంలోని చివరి సోమవారం సందర్భంగా చర్లలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామునుండే మహా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. అంతే కాకుండా నీలకంటేశ్వరునికి ఇష్టమైన పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

## కళా బృందానికి అదనపు కలెక్టర్ అభినందనలు



**ఖమ్మం, నవంబర్ 25, మహా:** ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలో చేపట్టిన కార్యక్రమాలను అద్భుతంగా వివరిస్తూ నృత్య రూపకం ప్రదర్శించిన కళా బృందానికి అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ ప్రత్యేక అభినందనలు తెలిపారు. సోమవారం సాయంత్రం మధిరలోని వర్తక సంఘ భవనంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మరో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా పాలేరు, ఖమ్మంలో అలేఖ్య సారథ్యంలో బృందం జయ జయహే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మునిసిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయ లక్ష్మి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిధులు దుర్వినియోగానికి నిలువెత్తు సాక్షాలు..!





**ఖమ్మం, మహా:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాధనం ఎలా దుర్వినియోగం చేశారో తెలుసుకునేందుకు వారు చేపట్టిన నిర్మాణాలే సజీవ సాక్షాలుగా మిగిలిపోతున్నాయి. నాడు ప్రజా సంక్షేమం పేరుతో కోట్లాది రూపాయలను అవగాహన లేకుండా ఇష్టానుసారంగా ఖర్చు చేసి చేతులు దులుపుకున్నారు. అటు ప్రజలకు కానీ, ఇటు ప్రభుత్వానికి కానీ ఆదాయం లేకుండా నిర్వీర్యమై పోతున్న ఈ నిర్మాణాల తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాల పేరుతో ఖమ్మం నగరంలో పలుచోట్ల 17 కోట్ల 50 లక్షల రూపాయలతో 246 దుకాణాలు నిర్మించిన ఈ ప్రాంగణాలు వ్యాపారులు, ప్రజలు లేక వెలవెల బోతున్నాయి. వీటిని ప్రారంభించి రెండేళ్లు కూడా పూర్తికాకపోయినా నాణ్యత లోపాల శాపాలు కాస్త వీటిని త్వరలోనే శిథిలావస్థకు చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే ఈ నిర్మాణాలు చేపట్టినట్లు స్పష్టమవుతుంది. ప్రస్తుత ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఈ ప్రాంగణాల విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే..!

## మండల స్థాయి సమస్యలను మండలాల్లోనే పరిష్కరించాలి

**▪ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం, నవంబర్ 25, మహా:** మండల స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలను మండలాల్లోనే పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం తల్లాడ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లాడ మండలానికి సంబంధించి కలెక్టరేట్ కు గత ప్రజావాణిలో 19 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 10 దరఖాస్తులు మండల స్థాయిలోనే పరిష్కారం అయ్యేవని తెలిపారు. దరఖాస్తుల గురించి కలెక్టర్, ఇంచార్జ్ తహసీల్దార్ ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో సర్వే ప్రక్రియ పురోగతి పై ఆరా తీశారు. సర్వే తుది దశలో ఉన్నట్లు, డేటా నమోదు ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. డేటా నమోదును నాణ్యతతో చేయాలని, సంబంధిత ఎన్యుమరేటర్లను డేటా నమోదులో భాగస్వామ్యం చేయయాలని ఆయన అన్నారు. నెలాఖరుకు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, ఇంచార్జ్ తహశీల్దార్ వనజ, వివిధ శాఖల మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**వైరా, నవంబర్25, మహా:** వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ సోమవారం ప్రారంభించారు. అనంతరం కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే క్వింటాకు 500 రూపాయలు బోనస్ గా ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, మార్క్ ఫ్రైడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, దొడ్డ పుల్లయ్య, యడ్లపల్లి వీరయ్య చౌదరి, బోళ్ళ గంగారావు, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పమ్మి అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీడీకే రత్నం, మల్లు రామకృష్ణ,మట్టూరి కృష్ణారావు, పొట్టపల్లి శ్రీను, మచ్చ వెంకటేశ్వరరావు (బుజ్జి), రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ దర్గీ చెన్నారావు, చింతనిప్పు మాధవరావు, కట్ల సంతోష్, జవ్వాజి నాగరాజు, మట్టూరి నాగేశ్వరరావు, శీలం నాగిరెడ్డి, సేలం సురేందర్ రెడ్డి, గాంధీ, తోటకూర నాగేశ్వర రావు, నర్వనేని గోపాలరావు,సత్తెనపల్లి నరసింహారావు, అధికారులు వైరా ఎమ్మార్వో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి ఏడి కరుణ శ్రీ, ఏవో మంజు ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



## ఎఫ్ఏ క్యూ ధాన్యం కొనుగోలు చేయాలి



**ములుగు, మహా:** ఖరీఫ్ 2024-25సీజన్ లో సేకరించే ధాన్యాన్ని ఎఫ్ఏక్యూ ప్రమాణాతో కొనుగోలు చేయాలని పౌరసరఫరాల సంయుక్త కమిషనర్ మోహన్ కుమార్ రాథోడ్, సహాయ కమిషనర్ వెంకటేశ్వర్ రావు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్ జీ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో మిల్లర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చిన ధాన్యం ఎఫ్ ఏక్యూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించిన తర్వాతనే ఎటువంటి కోత విధించకుండా దిగుమతి చేసుకోవాలన్నారు. ఈ విషయంలో ఏ మిల్లరైనా అవకతవకలకు పాల్పడినచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించని మిలర్లపై చర్య తీసుకోవటంతో పాటు, ఆ మిల్లును భవిష్యత్తులో ఎటువంటి బిజినెస్ చేయకుండా రద్దు చేస్తామని పేర్కొన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాంపతి, జిల్లా అధికారి ఫైజల్ హుస్సేన్, డీసీవో సర్దార్ సింగ్, మిలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలి

**ఖమ్మం, నవంబర్ 25, మహా:** స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్, తల్లాడ మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్రింద ఏర్పాటు చేసిన దేవహత్రేయ ఫ్యాన్సీ జనరల్ స్టోర్ ను ప్రారంభించారు. జనరల్ స్టోర్ ప్రోప్రయిటర్ దేవసుధని అడిగి, స్టోర్ లో ఏమేం అందుబాటులో ఉంచారు, ఎంత ఋణం తీసుకున్నారు, ఇదివరకు వ్యాపార అనుభవం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో డిమాండ్ ఉన్న వస్తువుల అమ్మకం చేయాలని, వినియోగదారునికి అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ అన్నారు. అనంతరం తల్లాడ మండలం అంజనాపురం గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో కూర్చొని మాట్లాడారు. వెదురుతో చాటలు, బుట్టలు, చేతి విసనకర్ర, అలంకరణ సామాగ్రి తయారీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో ఎస్. సన్యాసయ్య, తల్లాడ ఎంపీడీవో చంద్రమౌళి, డీపీఎంలు దర్గయ్య, శ్రీనివాస్, గ్రామ దీపిక విజయ లక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



**ముదిగొండ, నవంబర్ 25, మహా:** రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు రైతులకు హామీ ఇచ్చారు. సోమవారం ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామంలో ముదిగొండ ప్రాథమిక పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ... కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రాల్లో రైతులకు రశీదులు ఇస్తున్నామని తెలిపారు. రైతులకు 48 గంటల్లో ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సన్న వడ్లకు క్వింటాకు 500 రూపాయల చొప్పున బోనస్ 5 రోజుల్లో రైతుల ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమ్మినేని రమేష్ బాబు, సోసైటీ అధ్యక్షులు తూపాకుల యలగొండ స్వామి, వనం బాబు, మాజీ సర్పంచ్ చిలకల రామక్రిష్ణ, మీగడ నాగేశ్వరరావు, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీలర్లు నిబంధనలు పాటించాలి



**బోనకల్, నవంబర్ 25, మహా:** మండల పరిధిలోని రైతువేదిక నందు విత్తనాలు, ఎరువులు క్రిమిసంహారక మందుల డీలర్లు పాటించవలసిన నియమాలు తీసుకోవలసిన జాగ్రతల గురించి సహాయ వ్యవసాయ సంచాలకులు (మధిర) స్వర్ణ, విజయ చంద్ర పలు సూచనలు చేశారు. లైసెన్సు లేకుండా వ్యాపారం ప్రారంభించరాదని, లైసెన్సు గడువుకు ముందే రెన్యూవల్ చేయించుకొనుటకు తగినంత ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లైసెన్సులు దుకాణంలో కనిపించేటట్లు ప్రదర్శించాలాన్నారు. దుకాణం యొక్క పేరు, డోర్ నెంబరు తప్పనిసరిగా పెయింట్ చేయించాలన్నారు. వ్యాపార సంస్థ యొక్క పేరు (నేమ్ బోర్డు) కనబడేటట్లు ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు పసునూరి వినయ్ కుమార్, సోములపల్లి మానస, వ్యవసాయ విస్తరణ అధికారులు గోగుల హరికృష్ణ, నాగినేని నాగసాయి, బోనకల్, చింతకాని మండల డీలర్లు పాల్గొన్నారు.

## అంబులెన్స్ ను ప్రారంభించిన కలెక్టర్



**ఖమ్మం, నవంబర్ 25, మహా:** సామాజిక బాధ్యతతో ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు అంబులెన్స్ అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి అందించిన నూతన అంబులెన్స్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...బ్యాంకుల పట్ల ప్రజలకు ఉన్న వివిధ రకాల భయాలను తొలగించే దిశగా ప్రజల సంక్షేమం కోసం తాము ఉన్నామని చెబుతూ పబ్లిక్ బ్యాంకులు సామాజిక బాధ్యతతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావు, ప్రభుత్వ హాస్పిటల్ సూపెరింటెండెంట్ కిరణ్ కుమార్, బ్యాంక్ ఏజీఎమ్ సర్వేశ్, ఏజీఎమ్ సుధాకర్ రావు, డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



**కల్లూరు, నవంబర్ 25, మహా:** మండల పరిధి కిష్టయ్య బంజరు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన భూక్యా భీఖ్యాకు ఇటీవల రెండు కిడ్నీలు కోల్పోయి ఆర్థిక పరిస్థితి బాగలేక దైన్య స్థితిలో ఉండగా అదే గ్రామానికి చెందిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ప్రధాన అనుచరుడు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు భీఖ్యా నివాస గృహానికి వెళ్ళి అతని స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ లక్కినేని కృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన లక్కినేని కృష్ణ,ఏనుగు సత్యంబాబు కలసి భీఖ్యా కు కొంత ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని వారికి మనోధైర్యాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగు సత్యంబాబు,కిష్టయ్య బంజరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు,కిష్టయ్య బంజరు రాజబోయిన శ్రీనివాస రావు,బైర్ల కాంతారావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తోట సుబ్బారావు,విశ్వబ్రాహ్మణ కాలనీ కంభంపాటి పుల్లాచారి,ప్రవీణ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఒడిదొడుకుల్లోనే పయనం..




## ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలివే..

దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,536.80 పాయింట్లు లేదా 1.98 శాతం ఎగిసి 79,117.11 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 374.55 పాయింట్లు లేదా 1.59 శాతం ఎగబాకి 23,907.25 దగ్గర ముగిసింది. ఆ మునుపటి వారం ఇంతకన్నా ఎక్కువ నష్టాలపాలైన సంగతి విదితమే. ఇక ఈ వారం విషయానికొస్తే.. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు చాలానే ఉన్నాయి. తీవ్రరూపం దాల్చుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికాలో అదానీపై కేసు, క్యూ2 జీడీపీ గణాంకాలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా చెప్పుకోవచ్చు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. దీంతో ఆటుపోట్లకు ఆస్కారం ఎక్కువగానే ఉన్నది. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,300 24,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?**

ఒక కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.

**ఈటీఎఫ్‌ల ద్వారా..**

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.

**ఈక్విటీ ఎంఎఫ్‌లు**

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.

# టాప్-8 సంస్థల ఎం-క్యాప్ రూ.1.55 లక్షల కోట్లు వృద్ధి..

## హెచ్డీఎఫ్సీ బ్యాంక్.. టీసీఎస్‌లకు భారీగా లబ్ధి..!





**మహా, బిజినెస్:** గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈలో టాప్10 కంపెనీలలో ఎనిమిది కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,55,603.45 కోట్లు వృద్ధి చెందింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) భారీగా లబ్ధి పొందాయి. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నష్టపోయాయి. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1,536.8 పాయింట్లు (1.98 శాతం), ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 374.55 (1.59 శాతం) పాయింట్లు పెరిగాయి. బీఎస్ఈ సెన్సెక్స్ శుక్రవారం 1961.32 పాయింట్లు (2.52 శాతం) వృద్ధి చెంది 79,117.11 పాయింట్లు పెరిగితే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 557.35 (2.39 శాతం) పుంజుకుని 23,907.25 పాయింట్ల వద్ద స్థిర పడ్డాయి.

హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.40,392.91 కోట్లు వృద్ధి చెంది రూ.13,34,418.14 కోట్ల వద్ద స్థిర పడింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఎంక్యాప్ రూ.36,036.15 కోట్లు పెరిగి, రూ.15,36,149.51 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎంక్యాప్ రూ.16,266.54 కోట్లు పుంజుకుని రూ.9,01,866.22 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎంక్యాప్ రూ.16,189.33 కోట్ల లబ్ధితో రూ.7,90,151.83 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13,239.95 కోట్లు పెరిగి రూ.5,74,569.05 కోట్లకు చేరుకున్నది. ఐటీసీ ఎంక్యాప్ రూ.11,508.91 కోట్లు పుంజుకుని రూ.5,94,272.93 కోట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయిర్ టెల్ ఎంక్యాప్ రూ.11,260.11 కోట్లు వృద్ధి చెంది రూ.8,94,068.84 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎంక్యాప్ రూ.10,709.55 కోట్లు పెరిగి రూ.7,28,293.62 కోట్ల వద్ద ముగిసింది.

మరోవైపు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11,954.24 కోట్లు నష్టపోయి రూ.5,62,545.30 కోట్ల వద్ద స్థిర పడింది. రిలయన్స్ ఎంక్యాప్ రూ.2,368.16 కోట్లు పతనమై రూ.17,13,130.75 కోట్లకు చేరుకుంది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్, ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), ఐటీసీ నిలిచాయి.

# అదానీ హిండెన్ బర్గ్ కేసు..

## అమెరికా అభియోగాలను రికార్డుగా పరిగణించాలని సుప్రీంలో పిటిషన్




**మహా, బిజినెస్:** గౌతం అదానీ హిండెన్ బర్గ్ వివాదంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. సౌర విద్యుత్ ప్రాజెక్టులకు ఆమోదం పొందేందుకు భారత్ లోని వివిధ రాష్ట్రాల అధికారులకు ముడుపులిచ్చారన్న ఆరోపణలపై అమెరికా కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. అమెరికా కోర్టులో అభియోగాలను గౌతం అదానీ - హిండెన్ బర్గ్ కేసులో రికార్డులుగా పరిగణించాలని పిటిషనర్ కోరారు. అమెరికా కోర్టులో అభియోగాలకు గౌతం అదానీ హిండెన్ బర్గ్ కేసుకు సారూప్యత ఉందన్నారు. అమెరికా కోర్టులో అభియోగాల నమోదుతో 'అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడిందని వెల్లడిస్తుంది. ఈ ఆరోపణలు తీవ్రమైనవి. జాతి ప్రయోజనాల రీత్యా భారత దర్యాప్తు సంస్థలు కూడా దర్యాప్తు చేపట్టాలి' అని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్న సెబీ కూడా సమగ్ర నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.26,533 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు ఔట్..!




**మహా, బిజినెస్:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తిరిగి ఎన్నికవ్వడం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెలలో ఇప్పటి వరకూ దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) రూ.26,533 కోట్ల విలువైన పెట్టుబడులు ఉపసంహరించారు. దేశీయ కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాలు అంతంతే ఉండటంతోపాటు చైనా మార్కెట్లలో పెట్టుబడుల దిశగా విదేశీ ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తున్నది. అక్టోబర్ నెలతో పోలిస్తే ఈ నెలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తక్కువగా రూ. 94,017 కోట్ల పెట్టుబడులు ఉపసంహరించారు. ఓవరాల్‌గా ఇప్పటి వరకూ విదేశీ పోర్ట్ ఫోలియో పెట్టుబడులు నికరంగా రూ.19,940 బయటకు వెళ్లిపోయాయి. సెప్టెంబర్ నెలలో దేశీయ మార్కెట్లలో రూ.57,724 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టారు.



## దేశం-విదేశం NATIONAL NEWS



# ఎంపీతోపాటు 400మందికిపైగా కేసులు నమోదు



**మహా:** యూపీలోని సంభాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. స్థానికంగా ఉన్న స్కూళ్లను మూసివేశారు. ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. జనాలు గుంపులుగుంపులుగా గుమిగూడటంపై పోలీసులు నిషేధం విధించారు. స్థానిక నియోజకవర్గానికి చెందిన సమాజ్ వాదీ పార్టీ ఎంపీ జియావుర్ రెహమాన్, స్థానిక ఎమ్మెల్యే కుమారుడితోపాటు 400 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా, సంభాల్ పట్టణంలోని మొగల్ కాలనీకి చెందిన షాహీ జామా మసీదు ఉన్న చోట గతంలో హరిహర మందిరం ఉండేదన్న ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన న్యాయస్థానం సర్వే చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో ఆదివారం అధికారులు సర్వే అక్కడకు వెళ్లి నిర్వహించసాగారు. ఈ క్రమంలో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు గుంపులు గుంపులుగా అక్కడికి వచ్చి సర్వే చేయొద్దంటూ మసీదు ముందు ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సర్వేను అడ్డుకున్నారు. పోలీసులకు చెందిన వాహనాలకు నిప్పు పెట్టి, వారిపై రాళ్లు రువ్వారు. వెంటనే అలర్ట్ అయిన పోలీసులు భారీగా మోహరించి లాఠీ చార్జ్ చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడ ఉద్రిక్త పరిస్థితులే నెలకొన్నాయి. ఈ అల్లర్ల కారణంగా నలుగురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. గాయపడినవారిలో పోలీసులు కూడా ఉన్నారు. ఈ ఘటన విషయమై పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే... బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారు.



# శబరిమలకు పోటెత్తిన భక్తులు..

## 9 రోజుల్లో రూ.41 కోట్ల ఆదాయం



శబరిమల అయ్యప్ప ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. మండల దీక్ష చేసిన అయ్యప్ప దీక్షా స్వాములతోపాటు వేలాదిగా భక్తులు శబరిమలకు తరలివస్తున్నారు. దీంతో శబరిగిరులు అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. పెద్ద సంఖ్యలో మాలధారులు రావడంతో స్వామి వారి దర్శనానికి దాదాపు 10 గంటల సమయం పడుతోంది. సన్నిధానం నుంచి పంబ వరకు అయ్యప్ప భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. గతేడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో భక్తులు శబరిమలకు తరలివస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మండల - మకరవిళక్కు సీజన్‌లో భాగంగా మొదటి తొమ్మిది రోజుల్లోనే ఏకంగా ఆరు లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు దేవస్థానం బోర్డు ట్రావెన్‌కోర్ దేవస్వాం తెలిపింది. నవంబర్ 16న ఆలయం తెరుచుకోగా, ఈ తొమ్మిది రోజుల్లోనే 6,12,290 మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌లో కేవలం 3,03,501 మంది మాత్రమే స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపింది. పోలీసుల ముందస్తు చర్యలతో ప్రస్తుతం నిమిషానికి 80 మంది భక్తులు ఆలయంలోకి పవిత్రమైన పడి మెట్లను ఎక్కగలుగుతున్నారని పేర్కొంది. మరోవైపు భక్తుల రద్దీ పెరగడంతో పాటు ఆదాయం కూడా భారీగా సమకూరినట్లు దేవస్థానం బోర్డు వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో రూ.28.3 కోట్లు ఆదాయం రాగా.. ఈ సారి అది రూ.41.64 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఇది రూ.13.33 కోట్ల ఎక్కువ అని వెల్లడించింది. ఇక భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వండిపెరియార్ సత్రం, ఎరుమేలి, పంబాలలో మూడు ఆన్‌లైన్ బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దర్శనం లేకుండా ఏ భక్తుడు కూడా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి లేదని అన్నారు.

# నేను రాజీనామా చేయలేదు

## మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే



**మహా:** ఈ నెల 23న మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఎన్డీయే ఆధ్వర్యంలో మహాయుతి కూటమి భారీ విజయాన్ని సాధించింది. 233 స్థానాలను కైవసం చేసుకుని మరోసారి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుంది. ఘోర పరాజయం పాలైన మహా వికాస్ అఘాడి (ఎన్సీపీ, శివసేన, కాంగ్రెస్)కు కేవలం 49 స్థానాలు మాత్రమే వచ్చాయి. ఇటు కాంగ్రెస్ కు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఈ క్రమంలో మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే సంచలన నిర్ణయం తీసుకున్నారని, ఎన్నికల్లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ ఆయన అధ్యక్ష పదవికి సోమవారం రాజీనామా చేశారంటూ వార్తాలు వచ్చాయి. ఈ వార్తలపై ఆయన స్పందించారు. తానేమీ రాజీనామా చేయలేదన్నారు. ఇటు మహా వికాస్ అఘాడి కూడా చెక్కుచెదరకుండా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ మొత్తం 103 స్థానాల్లో పోటీ చేయగా, కేవలం 16 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. గతంలో ఎప్పుడూ కూడా ఈ విధంగా పార్టీ పరాజయాన్ని చవిచూడలేదు. ఆ 16 మంది గెలిచిన వారిలో నానా పటోలే కూడా ఉన్నారు. సకోలీ స్థానం నుంచి ఆయన పోటీ చేసి 208 ఓట్ల తేడాతో అతికష్టం మీద గట్టెక్కారు. 2021 నుంచి నానా పటోలే మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

# అండమాన్ తీరంలో ఐదు టన్నుల డ్రగ్స్ స్వాధీనం..

## కోస్ట్ గార్డ్ చరిత్రలో ఇదే అత్యధికం




**మహా:** అండమాన్ తీరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఫిషింగ్ బోట్ నుంచి దాదాపు 5 టన్నుల డ్రగ్స్‌ను ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కోస్ట్‌గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టుకోవడం ఇదే తొలిసారి అని రక్షణ అధికారులు తెలిపారు. 'అండమాన్ తీరంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. సుమారు 5 టన్నుల డ్రగ్స్‌ను పట్టుకుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టుకోవడం ఇదే తొలిసారి' అని డిఫెన్స్ అధికారి ఒకరు తెలిపారు.

# పెర్త్ టెస్ట్‌లో భారత్ ఘన విజయం

## ఆసీస్‌ను 295 పరుగుల తేడాతో మట్టికరిపించిన భారత్

బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆకట్టుకున్న భారత ఆటగాళ్లు
కాసేపు పోరాడిన ట్రావిస్ హెడ్
హాఫ్ సెంచరీతో టీమ్ టాప్ స్కోరర్
8 వికెట్లతో చెలరేగిన బుమ్రాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్
అడిలైడ్ లో డిసెంబర్ 6న రెండో టెస్ట్ ప్రారంభం
అందుబాటులోకి కెప్టెన్ రోహిత్ శర్మ



**స్పోర్ట్స్ డెస్క్ మహా :** ఆస్ట్రేలియా పై టెస్ట్ మ్యాచులలో భారత్ కు తిరుగు లేదని మరో మారు రుజువైంది.ఐదు మ్యాచుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీఇండియా సగర్వంగా 10 తో బోణీ కొట్టింది. అడిలైడ్ లో డిసెంబర్ 6 నుండి మొదలయ్యే రెండో టెస్ట్ కు పూర్తి ఆత్మ విశ్వాసం తో వెళ్తుంది. ముందు రోహిత్ ,గిల్ లేకుండా బరిలోకి దిగిన జట్టు పై అంచనాలు తక్కువే . అదే సమయంలో సొంత గడ్డపై న్యూజీలాండ్ తో వైట్ వాష్. దానికి తగ్గట్టే 150 పరుగులకు ఆలౌట్ . ఖతం ఈ టెస్ట్ లో భారత్ పరాజయం తప్పనిసరి అనుకున్న సమయంలో ముందుగా బౌలర్లు చెలరేగారు . ముఖ్యంగా కెప్టెన్ బుమ్రా 5వికెట్లతో ఆసీస్ నడ్డి విరిచాడు. సిరాజ్ 2 హర్షిత్ రాణా 3 వికెట్లు పడగొట్టి ఆసీస్ ను తొలి ఇన్నింగ్స్ లో 104 పరుగులకే ఆలౌట్ చేసారు. ఆతర్వాత బ్యాటర్లు సమయోచింతంగా రెచ్చిపోయి వారి వంతు బాధ్యత నిర్వర్తించారు.జైస్వాల్(161) వీరోచిత సెంచరీ , విరాట్ కోహ్లీ (100) సమయోచిత శతకం తో పాటు రాహుల్ 77,నితీష్ 38,సుదర్ 29, పడిక్కల్ 25 కూడా రాణించడంతో భారత్ కంగారూల ముందు 533 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించి మూడోరోజు ఆట చివర్లో డిక్లేర్ చేసి కంగారు పెట్టింది. ఇంకేముంది కొండంత లక్ష్యం కళ్ళముందు కనపడే సరికి బెంబేలెత్తిన ఆసీస్ ఆటగాళ్లు అప్పటికే ఫీల్డింగ్ చేసి అలసి పోయి ఉండడంతో బ్యాటింగ్ చేయడానికి తారెత్తి పోయారు. 4.2 ఓవర్లకే 12 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయి ఓటమిని ఖరారు చేసుకున్నారు. ఓవర్ నైట్ స్కోర్ 3 వికెట్ల నష్టానికి 12 పరుగులతో నాలుగో రోజు బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియా ఉదయం మరో 5 రన్స్ జోడించి మరో వికెట్ కోల్పోయింది. ఓపెనర్ క్వాజా సిరాజ్ బౌలింగ్ లో కీపర్ పంత్ కు క్యాచ్ ఇచ్చి 4 పరుగులకు వెనుదిరిగాడు. అనంతరం వచ్చిన స్మిత్ తో కలిసి ట్రవిస్ హెడ్ 62 పరుగులు భాగస్వామ్యాన్ని నమోదు చేసారు.స్లోగా ఆడితే లాభం లేదనుకుని హెడ్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు . ఈ దశలో మరోమారు సిరాజ్ చెలరేగాడు. 17 రన్స్ చేసి కుదురుకుంటున్న స్మిత్ ను అవుట్ చేసాడు. పంత్ మరోమారు చక్కటి క్యాచ్ అందుకున్నాడు. 79 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన మిచెల్ మార్ష్ కూడా హెడ్ నే అనుసరించాడు . ఇద్దరు కలిసి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఇదే ఊపులో హెడ్ తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు .లంచ్ వరకు మరో వికెట్ కోల్పోకుండా ఆడిన కంగారు జట్టు బౌలర్లపై ఎటాకింగ్ కు దిగి ఒత్తిడి పెంచే ప్రయత్నం చేసారు. అటు హెడ్ ఇటు మార్ష్ ఇద్దరూ కదం తొక్కడంతో పరుగులు వేగంగా వచ్చాయి. ఈ దశలో మరో మారు బుమ్రా ఝులకిచ్చాడు. సెంచరీ దిశగా కదులుతున్న ట్రావిస్ హెడ్ ని ఓ చక్కటి బంతితో బోల్తా కొట్టించాడు.రౌండ్ ది వికెట్ వేసిన బంతిని ఆడబోయి కీపర్ పంత్ కు క్యాచ్ ఇచ్చి హెడ్ 89 పరుగులకు వెనుదిరిగాడు. దీంతో 82 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెర పడింది.తర్వాత క్రీజులోకి వచ్చిన అలక్స్ క్యారీ తో కలిసి ఇన్నింగ్స్ కొన సాగించాడు మార్ష్ . వీరి 21 పరుగుల భాగస్వామ్యానికి ఆలౌ రౌండర్ నితీష్ రెడ్డి చెక్ చెప్పాడు. 47 పరుగులతో ఆడుతున్న మార్ష్ రెడ్డి వేసిన లో టాస్ డెలివరీని కట్ చేయబోయి వికెట్ల మీదకు ఆడి క్లీన్ బౌల్డ్ గా పెవిలియన్ చేరాడు.ఇక అక్కడినుండి మరో రెండు వికెట్లు కోల్పోవడానికి ఎంతో సేపు పట్టలేదు.227 పరుగులకు 9 వికెట్లు కోల్పోయింది. మిచెల్ స్టార్క్ నాథన్ లయన్ లను వాషింగ్ టన్ సుందర్ వెంటవెంటనే ఔట్ చేయడంతో ఇక ఆసీస్ పని ముగిసి నట్టే అని భావిస్తుండగా క్యారీ కొంత సేపు ప్రతిఘటించాడు . చివరికి హర్షిత్ రాణా క్యారీని క్లీన్ బౌల్డ్ చేయడంతో 238 పరుగులకు ఆస్ట్రేలియా కథ ముగిసింది. బుమ్రా ,సిరాజ్ తలా మూడు వికెట్లు తీసుకోగా వాషింగ్ టన్ సుందర్ 2, నితీష్ రెడ్డి, హర్షిత్ రాణా తలో వికెట్ పడగొట్టారు. మూడున్నర రోజులలోనే మ్యాచ్ ముగియడం విశేషం. 5 మ్యాచ్ ల సిరీస్ లో ఫస్ట్ మ్యాచ్ ను భారత్ 295 పరుగుల భారీ తేడాతో గెలిచి సిరీస్ లో 10 ఆధిక్యత సాధించింది. సిరీస్ లో రెండో మ్యాచ్ డిసెంబర్ 6 నుండి 10 వరకు అడిలైడ్ ఓవల్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ కి కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో కొస్తాడు.దీంతో భారత బ్యాటింగ్ లైనప్ మరింత బలపడనుంది. రోహిత్ ఎంట్రీతో పడిక్కల్ పై వేటు పడే ఛాన్సుంది.ఒక వేళ గిల్ కూడా ఫిట్ గా ఉంటే తుది జట్టులోకి ఎవరొస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.



# రారాజు ఎవరో?..


## నేటి నుంచి ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్


**సింగపూర్:** చదరంగ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌నకు వేళైంది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్, డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) మధ్య సోమవారం నుంచి జరుగబోయే ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి సింగపూర్ ఆతిథ్యమిస్తున్నది. ఈనెల 25 నుంచి డిసెంబర్ 12 దాకా సాగే ఈ టోర్నీలో ఇరువురు 14 రౌండ్లలో తలపడతారు. విశ్వనాథన్ ఆనంద్ (2013) తర్వాత ప్రపంచ చాంపియన్‌గా నిలవాలనే పట్టుదలతో గుకేశ్ బరిలోకి దిగుతుండగా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని లిరెన్ యత్నిస్తున్నాడు. అయితే గతేడాది టైటిల్ నెగ్గిన లిరెన్.. ఈ ఏడాదికాలంలో మానసిక కుంగుబాటుకు లోనై ప్రధాన టోర్నీలకు దూరమయ్యాడు. కానీ గుకేశ్ మాత్రం ఈ ఏడాదికాలంలో నిలకడగా రాణించడమే గాక ఇటీవలే ముగిసిన క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో టైటిల్ నెగ్గి జోరుమీదున్నాడు.

# భువీ కోసం భారీగా వెచ్చించిన ఆర్సీబీ..

## కొనసాగుతున్న ఐపీఎల్ వేలం

భారత స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ కోసం ఐపీఎల్ 2025 వేలంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ భారీగా వెచ్చించింది. ఏకంగా రూ.10.75 కోట్లకు భువీని కొనుగోలు చేసింది. ఆ మేరకు భువనేశ్వర్ కుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కాగా భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ కెరీర్ 2009లో ప్రారంభమైంది. వరుసగా రెండు సీజన్‌లలో భువీని ఆర్సీబీ కొనుగోలు చేసింది. కానీ అతనికి ఆ రెండు సీజన్‌లలో ఏ ఒక్క మ్యాచ్‌లో కూడా తుది జట్టులో చోటు దక్కలేదు. అయితే 2014లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి వచ్చిన తర్వాత అతని దశ తిరిగింది. 2016, 2017 సీజన్‌లలో అద్భుతమైన ఆటతీరుతో వరుసగా పర్పుల్ క్యాప్ దక్కించుకున్నాడు. 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తొలి ఐపీఎల్ టైటిల్ దక్కించుకోవడంలో భువీ కీలకపాత్ర పోషించాడు. ఈసారి ఐపీఎల్ వేలానికి ముందు అతను టీమ్ నుంచి రిలీవ్ అయ్యాడు. వేలంలో ఆర్సీబీ అతడిని కొనుగోలు చేసింది.మరోవైపు భారత యువ ఆటగాళ్లు దీపక్ చాహర్, ముకేశ్ కుమార్, తుషార్ దేశ పాండే కూడా ఈ ఐపీఎల్ వేలంలో భారీ ధర పలికారు. దీపక్ చాహర్‌ను పంజాబ్, చెన్నైలతో పోటీపడి చివరికి ముంబై ఇండియన్స్ జట్టు సొంతం చేసుకుంది. అతని కోసం రూ.9.25 కోట్లు వెచ్చించింది. ముకేశ్ కుమార్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ రూ.8 కోట్లు ఖర్చు చేసింది. తుషార్ దేశ్ పాండేను రాజస్థాన్ రాయల్స్ రూ.6.50 కోట్లకు కొనుగోలు చేసింది.





# సినిమా వార్తలు MOVIE NEWS



# ఎవరూ క్రెడిట్ ఇవ్వరు.. పుష్ప నిర్మాతలపై డీఎస్పీ కామెంట్స్



సినీ ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్స్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. కొన్ని కాంబోల్లో సినిమా వస్తుందంటే చాలు బాక్సాఫీస్ రికార్డుల గురించే అంతటా చర్చ నడుస్తుంటుంది. అలాంటి జాబితాలో టాప్‌లో ఉంటుంది మైత్రీ మూవీ మేకర్స్‌సుకుమార్‌దేవీ శ్రీ ప్రసాద్ (Devi Sri Prasad) కాంబినేషన్. ఈ ముగ్గురి కాంపౌండ్ నుంచి వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

అయితే పుష్ప 2 ది రూల్ (Pushpa 2 The Rule) సినిమా విషయంలో మాత్రం వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయని టాక్ నెట్టింట వినిపిస్తూనే ఉంది. దీనిక్కారణం ఈ సారి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో డీఎస్పీతోపాటు మరికొందరు సంగీత దర్శకులకు ఇవ్వడమనేది అంతటా నడుస్తున్న చర్చ. ఈ విషయం నిజమేనని పుష్ప 2 ది రూల్ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మరోసారి తేలిపోయింది.

ఈవెంట్‌కు దేవి శ్రీ ప్రసాద్ కాస్త ఆలస్యంగా వచ్చాడు. ఈ విషయాన్ని నిర్మాతల్లో ఒకరైన నవీన్ యేర్నేని డీఎస్పీని అడిగారు. దీంతో స్టేజ్‌పైనే తన సహనాన్ని నవ్వుతూ బయటపెట్టేశాడు దేవీ శ్రీ ప్రసాద్. పాటలు లేటని, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లేటని తనను అంటూనే ఉంటారని,. ఇప్పుడు కూడా ఫంక్షన్‌కు ఆలస్యంగా వచ్చానని ఫీలయ్యారని, ఈ విషయంలో తననేం చేయమంటారని తనదైన స్టైల్‌లో చురకలంటించాడు డీఎస్పీ. ఎవరూ క్రెడిట్ ఇవ్వరని, తీసుకోవాల్సిందేనని, అది పేమెంట్ అయినా, స్క్రీన్‌పై క్రెడిట్ అయినా తప్పదన్నాడు దేవీ శ్రీ ప్రసాద్. టైంకు పాట ఇవ్వలేదు.. టైంకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇవ్వలేదు. టైంకు ప్రోగ్రామ్ రాలేదని ఎక్కువ కంప్లైట్స్ చేస్తూ ఉన్నాయి. మీకు నా మీద ప్రేమ ఉంది. ఆ ప్రేమ ఉన్నప్పుడు కంప్లైంట్స్ కూడా ఉంటాయన్నాడు డీఎస్పీ. పుష్ప 2 డిసెంబర్ 5న విడుదలవుతున్న నేపథ్యంలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పూర్తి కాలేదని.. సుకుమార్ అండ్ టీం అదనంగా ఎస్ థమన్, అజనీష్ లోక్‌నాథ్, శ్యామ్ సీఎస్‌ను తీసుకోవడం డీఎస్పీకి నచ్చలేదని నెటిజన్లు, మూవీ లవర్స్ చర్చించుకుంటున్నారు. మరి సినిమా విడుదల నేపథ్యంలో ఎలాంటి ప్రభావం పడకుండా డీఎస్పీ, నిర్మాతలు రాజీకి వస్తారా..? అనేది చూడాలి.

## పుష్ప-2 కోసం నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

### అల్లుఅర్జున్ సినిమాను అడ్డుకోవడం ఎవరి వల్ల కాదు

**మాజీ మంత్రి అంబటి రాంబాబు**



**మహా:** పుష్ప 2 చిత్రం విషయమై కొంతమంది పని గట్టుకుని సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెడుతున్నారని, అల్లుఅర్జున్ సినిమాను అడ్డుకోవడం ఎవరి వల్ల కాదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పుష్ప 2 మూవీపై సోషల్ మీడియా కామెంట్లపై ఆయన స్పందించారు. కావాలనే కొంతమంది ఆ విధంగా చేస్తున్నారన్నారు. ఎవ్వరు ఏం చేసినా పుష్ప 2 రిలీజ్ అవడం... విజయం సాధించడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కూడా పలువురు ఎన్టీఆర్ సినిమాలను అడ్డుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యారని అన్నారు. సినిమా బాగుంటే ఎవరు ఆపినా ప్రజలు చూడక మానరన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు పుష్ప 2 సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. అందులో తాను కూడా ఉన్నానన్నారు. పుష్ప సినిమా మొదటి పార్ట్ ను తాను కూడా చూశానని, తనకు చాలా నచ్చిందన్నారు. ఈ క్రమంలోనే తాను పుష్ప 2 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తునన్నారు.



## స్విచాఫ్‌లో రాంగోపాల్ వర్మ ఫోన్.. ఇంతకీ ఎక్కడున్నాడో మరి..?

ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేసులో ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ విచారణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. ముందుగా ఈ కేసులో నవంబర్ 19 (మంగళవారం)న విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపినప్పటికీ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో మరోసారి నోటీసులు పంపించిన మేరకు నేడు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. రాలేనంటూ లాయర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు వర్మ. దీంతో రంగంలోకి దిగిన ఒంగోలు పోలీసులు హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి వెళ్లారు. అయితే వర్మ అక్కడ లేకపోవడంతో పోలీసులు గాలింపు చేపడుతున్నారు. వర్మ ఫోన్ స్విచాఫ్ అని వస్తుందని తెలుస్తోంది. వర్మ తాను కోయంబత్తూరులో ఉన్నట్టు ట్వీట్ చేయగా.. మరోవైపు సోషల్ మీడియాలో అకౌంట్ హ్యాండిల్స్ మాత్రం హైదరాబాద్‌లోనే చూపిస్తున్నాయట. వర్మకు ఓ ప్రముఖ నటుడు తన ఫాంహౌజ్‌లో ఆశ్రయం ఇచ్చినట్టుగా వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ మేరకు శంషాబాద్, షాద్ నగర్ దగ్గర రెండు ఫాంహౌజ్‌లపై ఏపీ పోలీసులు ఫోకస్ పెట్టినట్టు సమాచారం.



## నచ్చలేదు.. కానీ ప్రేమించాడు

అందం, అభినయ సామర్థ్యం రెండూ దండిగా ఉన్న కథానాయిక అషికా రంగనాథ్. కలిసొచ్చే అదృష్టం కోసం కళ్లలో దీపాలు పెట్టుకొని మరీ ఎదురు చూస్తున్నది ఈ కన్నడ కస్తూరి. సిద్ధార్థ్‌కి జోడీగా ఈ అందాలభామ నటించిన 'మిస్ యు' సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో సామ్యూల్ నిర్మించిన ఈ చిత్రంపై అషికా ఎంతో ఆశ పెట్టుకున్నది. ఇటీవల ఈ సినిమా గురించి తను మాట్లాడుతూ 'ఇందులో నా పేరు సుబ్బులక్ష్మి. సిద్ధార్థ్ పేరు వాసుదేవ్. నేనంటే తనకు అస్సలు పడదు. కానీ.. అనుకోకుండా నా ప్రేమలో పడిపోతాడు. కారణం ఏంటో తెరపైనే చూడాలి.' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్. ఇంకా మాట్లాడుతూ 'నేను ఎలాంటి పాత్రలనైతే ఇష్టపడతానో.. అలాంటి పాత్ర సుబ్బులక్ష్మి. తను ఇన్నోసెంట్. పక్కా ట్రెడిషనల్. ఓ విధంగా ఇది సుబ్బులక్ష్మి కథే. ఇంతటి మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు రాజశేఖర్‌కీ, హీరో సిద్ధార్థ్‌కీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని తెలిపింది అషికా.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY N SREENIVAS RAO, PUBLISHED AT 1-9-18/4-1, RAMNAGAR X ROAD, HYDERABAD. PRINTED AT SRI MATHA PRINTERS,H NO 1-1-562/1,GANDHI NAGAR, HYDERABAD.
REGD NO : APTEL/2003/9316. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034